




ఏకదంతాయ.. బహురూపాయ

ఏలూరు కంకణాల వీధిలో.. 12 అడుగుల త్రిశూల ధారిగా.. జటాజూటంతో పులి చర్మం ధరించిన రూపంలో భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాడు శివ గణపతి.

ఏలూరు దక్షిణపు వీధిలో.. తొమ్మిది అడుగుల అనంత పద్మనాభ రూపంలోని గణనాథుడు.. పాలకడలిలో శేష శయనంపై నిద్రిస్తూ.. నాభి నుంచి ఉద్భవించిన కమలంలో ఆశీనులైన బ్రహ్మ.. ఓ చేతిలో శివలింగంతో అబ్బురపరుస్తున్నాడు..

ఏలూరు దక్షిణపు వీధి మార్కండేయస్వామి దేవాలయం సమీపంలో.. విష్ణుమూర్తి దశావతారాలైన మత్స్య, నృసింహ, వరాహ అవతారాలను ధరించిన గణేషుడు..

నరసాపురంలో సూర్యప్రభతో.. వెలుగొందుతూ.. అశ్వారూఢుడై ఎనిమిది చేతులతో భక్తులకు దర్శనమిస్తున్న వినాయకుడు.



కలెక్టరేట్‌లో బార్లకు లాటరీ తీస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

పది బార్లకు లైసెన్సులు కేటాయింపు

» కలెక్టరేట్‌లో లాటరీ తీసిన కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు,ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పది బార్లకు నాలుగేసి చొప్పున దరఖాస్తులు రావడంతో ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ బి.శ్రీలత, సూపరింటెండెంట్ ఆనాల ఆవులయ్య ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో కలెక్టర్ కె.వెట్రిసెల్వి శనివారం లాటరీ తీసి లైసెన్సు కేటాయించారు. జిల్లాలో ఓపెన్ బార్లకు 18, రెండు కల్లుగీత కార్మిక వర్గాలకు కేటాయించిన బార్లకు దరఖాస్తులు ఆహ్వానించగా 52 దరఖాస్తులు దాఖలయ్యాయి. ఈనెల 29వ తేదీతో దరఖాస్తు గడువు ముగిసింది. పది బార్లకు మాత్రమే నాలుగుకు మించి ఎక్కువ దరఖాస్తులు వచ్చాయి. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు దరఖాస్తులు వచ్చిన ఓపెన్ కేటగిరిలో ఎనిమిది బార్లతో పాటు కల్లుగీత కార్మికులకు కేటాయించిన రెండింటికి లాటరీ తీసి లైసెన్సులు జారీ చేశారు. ఈ ప్రక్రియ ద్వారా ప్రభుత్వానికి రూ.4.30 కోట్లు ఆదాయం సమ కూరింది.

తొమ్మిది బార్లకు దరఖాస్తులు నిల్

కాగా మిగిలిన పది బార్లలో తొమ్మిది బార్లకు అసలు దరఖాస్తులే దాఖలు కాలేదు. ఈ తొమ్మిది బార్ల లైసెన్సులకు సంబంధించి త్వరలో ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని సూపరింటెండెంట్ ఆవులయ్య తెలిపారు. నూజివీడులో 12 నంబర్ బార్‌కు ఒకే దరఖాస్తు వచ్చినందున ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా సెప్టెంబరు ఒకటో తేదీ సాయంత్రం 6 గంటల వరకు ఔత్సాహికులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ ధనరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఇకపై స్మార్ట్‌గా..

» జిల్లాలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి

» రేపటి నుంచి ఇంటింటికీ పంపిణీ

» మొత్తం రేషన్ దుకాణాలు 1,123... కార్డులు 6,14,836

» ఒక్కొక్క దుకాణానికి ఒక సచివాలయ ఉద్యోగి నియామకం

ఏలూరుసిటీ, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి):జిల్లాలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి సంబంధించి జిల్లా పౌరసరఫరాల శాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది. సెప్టెంబరు ఒకటో తేదీ సోమవారం నుంచి క్యూఆర్ కోడ్ బేస్డ్ స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేయనున్నారు. జిల్లాలో మొత్తం 6,14,836 రేషన్ కార్డులున్నాయి. ఇందులో కొత్త కార్డులు 5,700 ఉన్నాయి. జిల్లాలోని 1,123 రేషన్ డిపోలకు ఒక్కొక్క రేషన్ దుకాణానికి ఒక సచివాలయ ఉద్యోగిని కేటాయించారు. సిబ్బంది కేటాయింపునకు సంబంధించి ఇప్పటికే మ్యాపింగ్ ప్రక్రియ పూర్తయింది. సచివాలయ ఉద్యోగులు, డీలర్ కలిసి కార్డుదారుల ఇంటికి వెళ్లి రేషన్ కార్డులు పంపిణీ చేస్తారు. ఈ పంపిణీలో తహసీల్దార్‌తో పాటు మ్యాపింగ్ అయిన సచివాలయ ఉద్యోగులు, డీలర్ ఈ-పౌరసరఫరాల యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. కార్డుదారుని ఇంటికి వెళ్లినప్పుడు రేషన్ కార్డుదారుని బయోమెట్రిక్ తీసుకుని కార్డు అందజేస్తారు. జిల్లాలోని అన్ని మండల తహసీల్దార్ కార్యాలయాలకు ఈనెల 31వ తేదీ నాటికి స్మార్ట్ రేషన్ కార్డులు చేరుకుంటాయి.వీటిని అయా రేషన్ షాపు డీలర్లకు పంపిస్తారు. సెప్టెంబరు ఒకటో తేదీ సోమవారం నుంచి ఐదు రోజుల పాటు ఐదో తేదీ వరకు ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేస్తారు. ఆపై సెప్టెంబరు 6వ తేదీ నుంచి 15వ తేదీ వరకు పది రోజుల పాటు రేషన్ షాపుల వద్దే డీలర్ పంపిణీ చేస్తారు. 16వ తేదీ నుంచి 20వ తేదీ వరకు ఐదు రోజుల పాటు మరల సచివాలయ ఉద్యోగులు కార్డులను ఇంటింటికీ తిరిగి పంపిణీ చేస్తారు.

కార్డుల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి

జిల్లాలో క్యూఆర్ కోడ్ బేస్డ్ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి ఏర్పాట్లు పూర్తయ్యాయి. సెప్టెంబరు ఒకటో తేదీ నుంచి 20వ తేదీ వరకు పంపిణీ చేస్తాం. సచివాలయ ఉద్యోగులు, రేషన్ షాపు డీలర్లు ఇంటింటికీ పంపిణీ చేస్తారు. పాత కార్డులతో పాటు కొత్త కార్డుదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేస్తారు.

- ఈటీ విలియమ్స్, జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి



ఎదగాలి..ఒదగాలి!

క్షేత్రస్థాయిలో పార్టీ బలపడాలి. పార్టీ కార్యక్రమాలు విస్తృతం కావాలి. తగ్గట్టుగానే ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రజల వెంట ఉండాలి. స్థానిక సంస్థల ఎన్నికలు వచ్చే నాటికి ఎక్కువ స్థానాల్లో పోటీ చేసే వాతావరణం సృష్టించాలి. అంతకంటే మించి పార్టీ ఎదిగేలా వ్యవహరించాలి.. కేడర్ సమావేశాల్లో బీజేపీ నేతలు పదేపదే చెప్పే మాటలివి. జిల్లా కార్యవర్గంలో ఇంతకుముందు మార్పులు, చేర్పులు జరిగాయి. రాష్ట్ర కమిటీలోను ఈ సారి జిల్లాకు పెద్దపీట వేశారు. బీజేపీ మార్కు జిల్లాలో కనిపించాలన్నది కమలనాథుల సరికొత్త వ్యూహం.

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

కమలంలో కొత్త ఒరవడికి విశ్వప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇప్పటివరకు క్షేత్రస్థాయిలో పార్టీ కాస్తో, కూస్తో బలపడేలా ప్రయత్నాలు సాగాయి. కొన్ని నియోజక వర్గాల్లో పార్టీ అనుకున్నంతగా పురోగతి సాధించలేకపోయింది. అయితే ఈసారి కైకలూరు నియోజకవర్గంలో కమలానికి సరైన మద్దతే లభించి అక్కడ ఎమ్మెల్యేగా డాక్టర్ కామినేని శ్రీనివాస్ రెండోసారి ఎన్నికయ్యారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ముందుండడం, పార్టీ కార్యక్రమాల అమలులో చొరవ చూపడం కైకలూరులో కొంత కలిసొచ్చింది. ఇక మిగిలిన స్థానాల్లో బీజేపీ చాన్నాళ్ల నుంచి విరామం లేకుండా శ్రమిస్తూనే ఉంది. పార్టీ బలాబలాలు తెలియాలంటే గత ఎన్నికల్లో ఉమ్మడిగా కాకుండా ఒంటరిగా పోటీ చేస్తే తెలిసి ఉండేది. కూటమి పేరిట పోటీకి దిగడంతో ఏ నియోజకవర్గాల్లో బీజేపీ ఓట్ల శాతం ప్రభావితం చేసిందో అంచనా వేయడానికి వీల్లేకుండా పోయింది. అంతకుముందు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా సోము వీర్రాజు ఉండడం ఒక ఎత్తయితే, ఆ తర్వాత దగ్గుబాటి పురందేశ్వరి గత ఎన్నికల సమరంలో కీలకపాత్ర వహించారు. దీనికి తగ్గట్టుగానే జిల్లా కమిటీలను కాస్తోకూస్తో ప్రక్షాళన చేశారు.

కమలంలో కొత్తదనం

» క్షేత్రస్థాయిలో కేడర్ ఆరాటం

» తగ్గట్టుగానే పార్టీలో మార్పులు,చేర్పులు

» గతం కంటే భిన్నంగా పరుగులు

» మూడో తేదీన రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ రాక.. సరికొత్త పరీక్షే

క్షేత్రస్థాయిలో శ్రమిస్తున్న కొందరికి జిల్లా కమిటీలో స్థానం కల్పించగలిగారు. అయినా ఏదో లోటు పార్టీని వెన్నాడుతూనే వచ్చింది. క్షేత్రస్థాయిలో పార్టీ ఊహించిందొకటి, జరుగుతున్నది ఇంకొక్కటిగా మారింది. మరోమారు రాష్ట్ర నాయకత్వంలో కొత్తదనం నింపేందుకు ప్రయత్నాలు జరిగాయి. రాష్ట్ర అధ్యక్షుడిగా పీవీఎన్ మాధవ్ సారథ్య బాధ్యతలు స్వీకరించారు. జిల్లాల వారీగా పార్టీ స్థితిగతులపై దృష్టి పెడుతున్నారు. ఇంతకుముందు రాష్ట్ర అధ్యక్ష హోదాలో ఎవరైనా జిల్లాలకు వస్తే సాదాసీదాగానే కార్యక్రమాలు సాగాయి. క్రియాశీలక కార్యకర్తలు మాత్రమే వెన్నంటి ఉండేవారు. జిల్లాల వారీగా పార్టీ బలపడే దిశగా పెద్దగా చర్చలు జరిగేవి కావు. సూచనలు, సలహాలు ఇవ్వాలని చెప్పి ముగించేవారు. క్షేత్రస్థాయిలో పార్టీ ఏ విధంగా అడుగులు వేస్తోంది, ఎవరు వెన్నంటి ఉండి నడిపిస్తున్నారు, గతానికి ఇప్పటికి తేడా ఏమిటనేది.. విశ్లేషణ కొరవడింది. అందుకనే గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లోనూ ఏలూరు లోక్‌సభ స్థానం నుంచి పోటీ (మిగతా 8వ పేజీలో)

మాధవ్ రాకతో తొలి పరీక్ష

రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ జిల్లా పర్యటనకు రానుండడంతో ఇప్పుడు బీజేపీ కేడర్‌కు మరోమారు అగ్ని పరీక్ష ఎదురైంది. వచ్చే నెల మూడో తేదీన మాధవ్ జిల్లాకు రానున్నారు. ఆయన రోజంతా ఏలూరులోనే పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఈ కార్యక్రమం విజయవంతం చేసే దిశగా ఇప్పటి నుంచే పార్టీ నేతలంతా తలోపని పంచుకున్నారు. ఈ సారి కూడా పార్టీ ఉపాధ్యక్షుడి హోదాలో తపన చౌదరి ఈ వ్యవహారం అంతటిని దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. అంతకుముందు రోజు భీమవరంలోను మాధవ్ పర్యటన ఉండడంతో దానికి ఏ మాత్రం తగ్గకుండా అట్టహాసంగా కార్యక్రమం నిర్వహించేందుకు సమాయత్తం అవుతున్నారు.

ఉచిత ప్రయాణం.. దొంగల చేతివాటం!



మహిళా ప్రయాణికులకు దొంగల బెడద.. ఉచిత బస్సుల్లో పెరిగిన చోరీలు

» క్షణాల్లో సెల్‌ఫోన్‌లు మాయం

» అప్రమత్తంగా ఉండాలంటూ ఆర్టీసీ అధికారుల సూచన

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో ఉచిత బస్సు ప్రయాణాల్లో మహిళలకు దొంగల బెడద ఎదురవుతోంది. ఆగస్టు 15 నుంచి ఉచిత బస్సు ప్రయాణాలు ప్రారంభం కాగా ఇటీవల దొంగలు, అపరిచితుల చేతివాటాలతో విలువైన సెల్‌ఫోన్లు చోరీకి గురవుతున్నాయి. మొదటి వారం ఎలాంటి చోరీలు జరగకపోగా గత వారం నుంచి బాగా రద్దీగా ఉన్న సమయాల్లో చోరులు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. ఏలూరు నుంచి హనుమాన్ జంక్షన్, అక్కడి నుంచి ఏలూరుకు వచ్చే పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు బస్సుల్లో చోరీలు జరుగుతున్నాయని ప్రయాణికులు బెంబేలెత్తుతున్నారు. మహిళలు ప్రయాణం చేసే సమయాల్లోనే విద్యార్థులు కాలేజీలకు, స్కూళ్లకు రాకపోకలు సాగిస్తున్నారు. ఈ క్రమంలో కొంత రద్దీగా బస్సు సర్వీసులుంటున్నాయి. జరగండి... జరగండి అంటూ మిగతా ప్రయాణీలను తొందరపెట్టి జరిగే క్రమంలో దొంగలు తమ చేతికి పని చెబుతున్నారు. నలుగురైదుగురుతో కూడిన అపరిచిత బృందాలు హడావుడి సృష్టించి సడన్‌గా బస్సులు దిగి వెళ్లిపోతున్నారు. అప్పటికే వచ్చిన పని కాస్త పూర్తయినట్టు ఎవ్వరు గ్రహించలేకపోతున్నారు. ఇటీవల ఏలూరు-హనుమాన్ జంక్షన్-వయా మచిలీపట్నం సర్వీసుల్లో ఇటీవల ఐదారు సెల్‌ఫోన్‌లు చోరీకి గురయ్యాయి. దీనిపై ఎవరికి కంప్లైంట్‌లు ఇవ్వలేక మహిళా ప్రయాణికులు మిన్నకుంటున్నారు. కొంతమంది విద్యార్థులు మాత్రం తమ సెల్‌ఫోన్లు పోయినట్టు పోలీసులకు ఫిర్యాదులు చేశారు. ఇటీవల ఏలూరు కొత్తబస్టాండ్‌లో ఒక ఫోన్‌ను చోరీ చేసేందుకు ప్రయత్నిస్తుండగా ఆ విషయాన్ని వెంటనే కొందరు పసిగట్టి కేకలు వేయడంతో ఆ దొంగ పలాయనం చిత్తగించాడు.

ఒక్క కానిస్టేబుల్‌తోనే సరి..

ఏలూరు కొత్త,పాత బస్టాండ్‌ల్లో పోలీస్ సిబ్బందిని గస్తీకి పెట్టారు. ఒక్క కానిస్టేబులే 10 నుంచి 15 ప్లాట్‌ఫారాలను తనిఖీ చేయాల్సి ఉంది. దీంతో రద్దీ సమయాల్లో పూర్తిస్థాయి నిఘా కొరవడుతోందన్న విమర్శలు విన్పిస్తున్నాయి. మహిళలు ఆధార్, ఇతర అర్హతా పత్రాలను తీసి చూపించే లోపు చోరీలు జరిగిపోతున్నాయి. ఆర్టీసీ అధికారులు మాత్రం అప్రమత్తంగా ఉండి బస్సులు ఎక్కాలని విజ్ఞప్తి చేస్తున్నారు. మహిళలు సైతం దొంగలను ఓ కంట కనిపెట్టుకుని ఉండాలని సూచిస్తున్నారు. ప్రభుత్వం బస్సుల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని మహిళా ప్రయాణికులు కోరుతున్నారు.

భోజనం బాగుంది..

» కలెక్టర్ వెట్రిసెల్వి..శనివారపుపేట జడ్పీ హైస్కూల్ సందర్శన

ఏలూరు అర్బన్, ఆగస్టు30(ఆంధ్రజ్యోతి): 'స్వతహాగా నేను కారంతో తయారు చేసిన ఆహార పదార్థాలను అంతగా ఇష్టపడను.. ఇక్కడ స్కూలులో మాత్రం రుచికరంగా ఉండటంతో భుజిస్తున్నాను' అంటూ కలెక్టర్ వెట్రిసెల్వి వ్యాఖ్యానించారు. ఏలూరు రూరల్ మండలం శనివారపుపేటలోని జడ్పీ హైస్కూలును శనివారం ఆమె సందర్శించారు. పాఠశాలలో మధ్యాహ్నభోజన పథకం ఆహార పదార్థాలను బాలబాలికలతో కలిసి ఆరగించారు. ఏకాగ్రతతో చదువుకోవాలని బాలబాలికలకు సూచించారు. ఐసీడీఎస్ పీడీ శారద, తహసీల్దార్ గాయత్రి, సీడీపీవో పద్మావతి పాల్గొన్నారు.


విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

వేధింపులు ఎదురైతే పెద్దలకు చెప్పండి..

ఏలూరు,ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు,చిన్నారులు ఎలాంటి వేధింపులు ఎదురైనా ధైర్యంగా పెద్దలకు తెలిపి సహాయం పొందాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి సూచించారు. మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో శనివారపుపేట జడ్పీ హైస్కూల్‌లో కిశోరి వికాసం 2.0లోని పలు అంశాలపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. ముఖ్య అతిథిగా కలెక్టర్ హాజరై పోక్సో చట్టం, గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌లపై వివరించారు. ఐసీడీ ఎస్ పీడీ శారద, నోడల్ ఆఫీసర్ తులసి, సీడీపీవో పద్మావతి, డీసీపీవో సూర్యచక్రవేణి, హెచ్‌ఎం పాల్గొన్నారు.

ఏలూరు కలెక్టరేట్ ప్రాంగణంలో ఉన్న ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల గొడౌన్‌ను వార్షిక తనిఖీల్లో భాగంగా కలెక్టర్ వెట్రిసెల్వి శనివారం తనిఖీ చేసి సిబ్బందికి సూచనలు చేశారు.

ఆరుగురు సచివాలయ ఉద్యోగులకు షోకాజ్ మెమోలు

నూజివీడు టౌన్, ఆగస్టు30 (ఆంధ్రజ్యోతి):విధుల నిర్వహణలో తీవ్ర నిర్లక్ష్యధోరణి అవలంభిస్తున్న సచివాలయ సిబ్బందికి నూజివీడు మునిసిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి షోకాజ్ మెమోలు జారీ చేశారు. పట్టణంలో పారిశుధ్య మెరుగుదల కార్యక్రమాలను నిర్వహించాలని రాష్ట్ర సమాచార పౌర సంబంధాలశాఖ మంత్రి కొలుసు పార్థసారధి ఆదేశాలు జారీ చేయడంతో శనివారం మంత్రి ఓఎస్డీ ఎన్.ప్రకాశరావు, కార్యాలయ సిబ్బందితో కలిసి కమిషనర్ వెంకటరామిరెడ్డి వార్డు సచివాలయం-7కు వెళ్లారు. ఆ సందర్భంగా వార్డులో పారిశుధ్యం అధ్వానంగా ఉండటం, చివరికి సచివాలయ పరిసర ప్రాంతాలు సైతం దారుణంగా ఉండడాన్ని గుర్తించారు. మరోవైపు వార్డు సచివాలయం-7లో మొత్తం ఎనిమిది మంది ఉద్యోగులు ఉండగా నిర్ణీత సమయం 11 గంటలకు కేవలం ఇద్దరు మాత్రమే హాజరు కావడం చూసి మంత్రి కొలుసు ఓఎస్డీ, కమిషనర్ నిర్ఘాంత పోయారు. దీంతో కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆరుగురు ఉద్యోగులకు షోకాజ్ మెమోలు జారీ చేశారు. అనంతరం కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు.


వేలేరుపాడు మండలం నాళవరంలో వరదనీరు

ఎగువన నిలకడ.. దిగువన ఉధృతి

» గోదావరి వరద ముంపులోనే లోతట్టు ప్రాంతాలు, రోడ్లు

» 23 గ్రామాలకు నిలిచిన రాకపోకలు

వేలేరుపాడు/కుక్కునూరు/పోలవరం,ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ముంపు మండలాల ప్రజలను తీవ్ర ఆందోళనకు గురి చేసిన గోదావరి వరద కొంతమేర శాంతించి నిలకడగా ఉంది. ప్రస్తుతం భద్రాచలం వద్ద 47.3 అడుగులకు గోదావరి నీటిమట్టం చేరుకోగా భద్రాచలం దిగువకు 11 లక్షల క్యూసెక్కుల వరద నీరు వస్తోంది. దీని కారణంగా వేలేరుపాడు మండలంలోని లోతట్టు ప్రాంతాల్లోని పొలాలు, రహదారులు, నీటమునిగాయి. వేలేరుపాడు-కోయిదా మధ్య 20 గ్రామాలు, వేలేరుపాడు-రేపాక గొమ్ము-రుద్రమ్మకోట ప్రధాన రహదారిపై వరదనీరు చేరడంతో మరో మూడు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. శనివారం అర్ధరాత్రి నుంచి గోదావరి తగ్గుముఖం పడుతుందని సీడబ్ల్యూసీ అధికారులు తెలిపారు. కుక్కునూరులోను వరద నిలకడగా కొనసాగుతోంది.

మళ్లీ పెరిగిన గోదావరి నీటిమట్టం


పట్టిసీమ శివక్షేత్రం వద్ద వరద ఉధృతి

పోలవరంలో గోదావరి నీటిమట్టం శనివారం సాయంత్రానికి వేగవంతంగా పెరిగింది. ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి ఉప నదుల వరద గోదావరిలో కలుస్తుండడంతో గోదావరి నీటి మట్టం పెరిగి గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. పట్టిసీమ శివ క్షేత్రం చుట్టూ వరద జలాలు ఆక్రమించాయి. కడెమ్మ స్లూయిజ్ వద్ద వరద జలాలు పెరగడంతో గేట్లు మూసుకుపోయి ఏటిగట్టు కుడివైపున ఉన్న కొండవాగుల జలాల నీటిమట్టం పెరుగుతూ వస్తోంది.

ముంపు ప్రాంతాల ప్రజలకు నిత్యావసరాలు

ఏలూరు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): గోదావరి వరద కారణంగా ముంపునకు గురైన కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని పలు గ్రామాల్లో ప్రజలకు నిత్యావసర సరుకులు, కాయగూరలను అధికారులు శనివారం పంపిణీ చేశారు. వేలేరుపాడు మండలంలో 7వేల912 కేజీలు, కుక్కునూరు మండలంలో 2వేల14 కేజీల కూరగాయలను పంపిణీ చేసినట్టు జంగారెడ్డిగూడెం ఆర్డీవో రమణ తెలిపారు.

కొనసాగుతున్న వర్షాలు

ఏలూరుసిటీ, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో అల్పపీడనం తీరం దాటినా ఇంకా జిల్లాలో అక్కడక్కడా వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. జిల్లాలోని చాలా ప్రాంతాల్లో శనివారం పొడి వాతావరణం నెలకొని ఉంది. గడచిన 24 గంటల్లో జిల్లాలోనే అత్యధికంగా టి.నరసాపురం మండంలో 42 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కాగా జిల్లాలో సరాసరి వర్షపాతం 3.7 మి.మీగా నమోదైంది. జీలుగుమిల్లి 20.2, చాట్రాయి 13.8, చింతలపూడి 13.2, కుక్కునూరు 6.8, నూజివీడు 2.4, వేలేరుపాడు 2.4, ఆగిరిపల్లి 1.8, పోలవరం 0.6, నిడమర్రు 0.4, లింగపాలెం, జంగారెడ్డిగూడెంలలో 0.2 మి.మీ వర్షపాతాలు నమోదయ్యాయి.

పశ్చిమ గోదావరి జిల్లాలోని పలు ప్రాంతాల్లో ప్రజా సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లోని స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లాలో ప్రధానంగా కొన్ని పట్టణ, గ్రామాల్లో సమస్యలు తిష్ట వేశాయి. కూటమి ప్రభుత్వంలోనైనా సమస్యలు పరిష్కారమవుతాయని ఆయా ప్రాంతాల స్థానికులు ఎదురుచూస్తున్నారు.

ప్రోబ్లమ్స్ జోన్

సమస్యల తిష్ట


తణుకులో నిరుపయోగంగా ఉన్న మునిసిపల్ కాంప్లెక్స్

మునిసిపల్ కాంప్లెక్సు నిరుపయోగం

తణుకు : రవాణా శాఖ కార్యాలయం కోసం మునిసిపల్ నిధులు వెచ్చించి నిర్మించిన కాంప్లెక్సు నిరుపయోగంగా ఉంది. తణుకు ప్రాంతీయ రవాణా శాఖ కార్యాలయం ఏళ్ల తరబడి అద్దె భవనాల్లోనే కొనసాగుతుంది. గతంలో ఉన్న ప్రభుత్వం శాశ్వతంగా రవాణా శాఖ కార్యాలయానికి భవనం ఉండే విధంగా, అదే సమయంలో మునిసిపాలిటీకి ఆదాయం వస్తుందనే ఉద్దేశంతో జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న మునిసిపల్ స్థలంలో కింద కమర్షియల్ షాపులు, పైన కార్యాలయం కోసమని నిధులు వెచ్చించి కాంప్లెక్సు నిర్మాణం చేశారు. పైన కార్యాలయానికి సంబంధించిన పనులు మాత్రమే మిగిలి ఉన్నాయి. రవాణా శాఖ ఉన్నతాధికారులు సైతం అప్పట్లో అనుమతుల మేరకు ఒప్పందం చేసుకున్నారు. అనంతరం ప్రభుత్వం మారడంతో కథ మొదటికి వచ్చింది. తర్వాత చాలామంది అధికారులు మారిపోవడం.. తరువాత వచ్చిన అధికారులు దానిపై దృష్టి పెట్టకపోవడం వల్ల పెద్దఎత్తున ప్రజాధనం నిరుపయోగమైంది. ఇప్పటికైనా రవాణా శాఖ ఉన్నతాధికారులు సంప్రదింపులు చేసినట్టయితే మునిసిపాలిటీకి అద్దె రూపంలో ప్రతినెల కొంత సొమ్ము వస్తుంది. పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకొచ్చినట్టవుతుంది.

అద్దెకు ఇచ్చేందుకు సిద్ధం..



షాపింగ్ కాంప్లెక్సులో రవాణా కార్యాలయం నిర్మించిన విషయం తెలియదు. తర్వాత పరిశీలన చేసినప్పుడు ఆర్టీవో కార్యాలయం వేరే భవనంలో ఉండడం వల్ల ముందుకు రావడం లేదని తెలిసింది. అప్పట్లో ఏమి జరిగిందో తెలియదు. అయితే ఎవరైనా కార్యాలయాలతో పాటు సంస్థలు ఏర్పాటుకు ముందుకు వస్తే అన్నీ పూర్తి అద్దె లేదా లీజుకు ఇస్తాం.

- టి.రామ్‌కుమార్. మున్సిపల్ కమిషనర్, తణుకు

కుక్కలు భౌభౌ..

పాలకొల్లు, ఆచంటల్లో వీధి శునకాల స్వైర విహారం

పాలకొల్లు అర్బన్/ఆచంట : పాలకొల్లు పట్టణంలో కుక్కలు ఓవైపు, పందులు, ఆవులు పోటీపడి సంచరిస్తున్నాయి. వీటితో పాటు అపారిశుధ్యంతో ప్రజలు తీవ్ర ఇబ్బం దులు ఎదుర్కొం టున్నారు. పట్టణంలో విచ్చలవిడిగా సంచరి స్తున్న పశువులు స్పీడ్ బ్రేకర్లుగా మారి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగిస్తున్నాయి. రహదారులపై చిన్నారులు సంచరించడానికి భయపడే విధంగా కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతున్నాయి. వీటిని అదుపు చేయడానికి అధికారులు చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. ఆచంట మండలంలో విచ్చలవిడిగా వీధి కుక్కలు తిరుగుతున్నాయి. ఏ వూరు అయినా ఏ వీధిలో అయినా పగలు, రాత్రి తేడా లేకుండా వీధి కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతున్నాయి. రోడ్డు మీద నడిచేవారిపై, బైక్‌లపై వెళ్లేవారిపై వీధి కుక్కలు దాడుల చేసి గాయపరిచిన ఘటనలు నిరంతరం జరుగుతున్నాయి. గత కొన్నేళ్లుగా ఏ గ్రామంలో కూడా వీధి కుక్కలను నిర్మూలించిన దాఖలాలు లేవు. ఇటీవల ఢిల్లీ వీధుల్లో ఒక కుక్క కూడా ఉండకూడదని సుప్రీం కోర్టు ఆదేశించిన మేరకు అదేవిధంగా గ్రామాల్లో వున్న కుక్కల సమస్యలపై అధికారులు స్పందించాలని, వీధి కుక్కల బెడద లేకుండా చూడాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


పాలకొల్లు సంత మార్కెట్ వద్ద వీధి కుక్కలు

చినుకు పడితే చిత్తడే..

యానాలపల్లి ఎస్సీ కాలనీ వాసుల ఆవేదన

పెంటపాడు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): నడవాలంటే రహదారి లేదు. బురదతో చిద్రంగా మారిన రహదారుల దుస్థితి ఒకవైపు అయితే, మరోవైపు పారిశుధ్య సమస్యలతో ప్రబలుతున్న దోమలు. ఇదీ యానాలపల్లి ఎస్సీ కాలనీలో అంతరహదారుల దుస్థితి. చిన్నపాటి వర్షం వచ్చిందంటే చాలు రహదారి మొత్తం అధ్వానంగా మారిపోతుంది. గత వైసీపీ పాలనలో రహదారులను పట్టించుకోలేదు. ఫలితంగా వర్షం కురిసిన ప్రతీసారి చిత్తడిగా మారిన రహదారులతో ప్రజలు నిరంతరం నరకం చూస్తున్నారు. వర్షపు నీరు డ్రెయినేజీల్లోకి వెళ్లకపోవడంతో అక్కడే నిలిచి రహదారి మొత్తం అధ్వానంగా మారిపోతుంది. కనీసం కూటమి ప్రభుత్వ హయాంలోనైనా తమ కష్టాలు తీరతాయని స్థానికులు ఎదురుచూస్తున్నారు.


యానాలపల్లి ఎస్సీ కాలనీ రహదారి దుస్థితి

'దేవాలయం'లో పార్కింగ్ ఇక్కట్లు


పార్కింగ్ స్థలంలో వ్యాపారాల దృశ్యం

పాలకొల్లు అర్బన్ : స్థానిక క్షీరారామలింగేశ్వర స్వామి ఆలయానికి చెందిన మెయిన్ రోడ్డులో గల పార్కింగ్ స్థలాన్ని పలువురు చిరు వ్యాపారులు ఆక్రమించి వ్యాపారాలు చేసుకోవడంతో ఆలయానికి వచ్చే భక్తులు తమ వాహనాలను పార్కింగ్ చేసుకునేందుకు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈనెల 27వ తేదీన వినాయక చవితి సందర్భంగా గణనాథుల ప్రతిమలు అమ్మేవారు, పత్రి అమ్మేవారు పార్కింగ్ స్థలంలో బల్లలు వేసి ఆక్రమిం చడంతో భక్తులు వాహనాలు ఎక్కడ పార్కింగ్ చేసుకోవాలని ప్రశ్నిస్తున్నారు. దీని వల్ల మెయిన్‌రోడ్డులో ట్రాఫిక్ సమస్య తలెత్తుతుందని, తక్షణం చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీసులు, ఆలయ సిబ్బందిని కోరుతున్నారు. దీనిపై ఈవో ముచ్చర్ల శ్రీనివాసరావును ప్రశ్నించగా పట్టణ సీఐ రజనీకుమార్ దృష్టికి తీసుకువెళతామని తెలిపారు.

'పాలిటెక్నిక్' విద్యార్థుల వెతలు


తాడేపల్లిగూడెంలో పాలిటెక్నిక్ కళాశాల

తాడేపల్లిగూడెం రూరల్ : అది ఓ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల. తాడేపల్లిగూడెం పట్టణానికి నాలుగు కిలోమీటర్లు, హాస్టల్‌కు ఆరు కిలోమీటర్లు దూరంలో ఉండడంతో విద్యార్థులు కళాశాలకు వెళ్లడానికి నరక యాతన అనుభవిస్తున్నారు. అక్కడ పాలిటెక్నిక్ కళాశాలలో హాస్టల్ వసతి లేకపోవడంతో కొందరు ఏలూరురోడ్డులోని బీసీ హాస్టల్‌లో, మరికొందరు ఎస్సీ హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్నారు. విద్యార్థులు కళాశాలకు వెళ్లాలంటే నిత్యం అగచాట్లు తప్పడంలేదు. కళాశాల సమయానికి గంట ముందు బయల్దేరితే తప్పవారు సమయానికి చేరుకోలేని పరిస్థితి. ఈ కళాశాలతోపాటు నన్నయ విశ్వవిద్యాలయ విద్యార్థులకు ఇదే పరిస్థితి. వారు కూడా కళాశాలకు వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటు పాలిటెక్నిక్ కళాశాలలో చదివే విద్యార్థులు మరోపక్క నన్నయ్య క్యాంపస్ విద్యార్థులు కలిపి సుమారు 80 మందికిపైగా ఈ సమస్య ఎదుర్కొంటున్నారు. బస్సు సౌకర్యం ఏర్పాటుచేస్తే ఇబ్బంది లేకుండా ఉంటుందని విద్యార్థులు వేడుకుంటున్నారు.

ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషిస్తున్నాం..



పాలిటెక్నిక్ కళాశాల హాస్టల్‌లో 46 మంది విద్యార్థులు ఉంటున్నారు. వారికి బస్సు సౌకర్యం కల్పించాలని ఆర్టీసీ ఆర్‌ఎంకు లేఖ రాశాం. కానీ వారు కనీసం 50 మంది విద్యార్థులకు నెలకు రూ.1500 చొప్పున పాస్‌లు కట్టిస్తే బస్సు పెడతాం అంటున్నారు. ఈ పిల్లలంతా పేదకుటుంబాల వారే కావడంతో ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషిస్తున్నాం.

- డి.ఫణీంద్రకుమార్ ప్రిన్సిపాల్ పాలిటెక్నిక్ కాలేజీ తాడేపల్లిగూడెం.

మూగ రోదన

పశు వైద్యులు కావలెను ?

» వైద్యులు లేక పశువులకు అందని వైద్యం

» కాళ్ల పశు వైద్యశాలలో అన్ని బాధ్యతలు అటెండర్‌కే..


కాళ్లలో పశు వైద్యశాల

కాళ్ల : పశు వైద్యశాలల్లో వైద్యుల కొరతతో పాడి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాళ్ల మండలంలో పశువులకు ఏ అనారోగ్యం వచ్చినా చూసే వైద్యులు లేక అవస్థలు పడాల్సి వస్తుందని పాడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో కాళ్ల, జువ్వలపాలెం, కోపల్లె, పెద అమిరం గ్రామాల్లో పశు వైద్యశాలలు ఉన్నాయి. ఈ ఆసుపత్రుల్లో డాక్టర్లు గాని, కాంపౌండర్లు గాని ఏ ఒక్కరూ లేకపోవడంపై రైతులు పెదవి విరుస్తున్నారు. మండల కేంద్రమైన కాళ్ల పశు వైద్యశాలలో అన్నీ అటెండరే బాధ్యతలు తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. పెద అమిరం, కోపల్లె వైద్యశాలల్లో జూనియర్ వెటర్నరీ ఆఫీసర్లు (జేఈవో) మాత్రమే ఉన్నారు. పశు వైద్యాధికారులు లేకపోవడంతో ఆకివీడు మండలం సిద్ధాపురం గ్రామానికి చెందిన పశు వైద్యాధికారి కాళ్ల మండలంలో వైద్యాధికారిగా ఇన్‌ఛార్జి బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. మండలంలో సుమారు తొమ్మిది వేల పశువులు ఉండగా ఎనిమిది వేల మంది రైతుల కుటుంబాలు పశువులపై ఆధారపడి జీవిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా స్థాయి ఉన్నతాధికారులు స్పందించి వెంటనే శాశ్వత ప్రాతిపదికన పశు సంవర్ధక శాఖ వైద్యులను ఏర్పాటు చేయాలని పలువురు పాడి రైతులు కోరుతున్నారు.

వైద్యుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం..

కాళ్ల మండలంలో పశువైద్యుల కొరత ఉన్నమాట వాస్తవమే. రైతుల ఇబ్బందుల దృష్ట్యా ప్రస్తుతం ఇన్‌చార్జి వైద్యులను ఏర్పాటు చేశాం. పరిస్థితిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి శాశ్వత ప్రాతిపదికన వైద్యులను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

- డాక్టర్ మల్లేశ్వరరావు, ఏడీఏ

ముంచుతున్న మురుగు నీరు

» రోడ్లపైనే బహుళ అంతస్తుల మురుగు


ఖాళీ స్థలంలోకి అపార్ట్‌మెంట్ మురుగు నీరు పైపు

తాడేపల్లిగూడెం రూరల్ : తాడేపల్లిగూడెం ఎఫ్‌సీఐ కాలనీ వాసులు మురుగునీటి సమస్యతో సతమతమవుతున్నారు. కాలనీలోని రోడ్డు నంబరు 6, 7 ప్రాంతంలో అపార్ట్‌మెంట్‌లు, హాస్టల్స్ నుంచి మురుగునీటి సమస్య తీవ్రస్థాయికి చేరింది. ప్రతిరోజూ మురుగునీరు రోడ్లపైకి, ఖాళీ స్థలాల్లోకి చేరుతుండడంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డ్రెయినేజీ లేకపోవడం అపార్ట్‌మెంట్‌లకు మురుగునీరు పారే మార్గం లేక ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై సత్వరమే చర్యలు తీసుకోవాలని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

చర్యలు తీసుకుంటాం



అపార్ట్‌మెంట్‌లు, హాస్టల్స్‌కు సంబంధించిన మురుగునీటి పారేందుకు వారే ప్రత్యేక ఏర్పాట్లు చేసుకోవాలి. ప్రజలకు దోమల సమస్య మురుగునీరు బయటకు వదలడం వల్లే సమస్య ఎదురవుతుంది. సంబంధిత ప్రాంతంలో పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

- ఏసుబాబు, మునిసిపల్ కమిషనర్.

పోస్టుమార్టం షెడ్డు నిర్మించేనా ?

» మంజూరై మూడేళ్లు గడిచినా.. ముందుకు సాగని పనులు


ఆకివీడులో సామాజిక ఆరోగ్య కేంద్రం

ఆకివీడు: ఆకివీడు సీహెచ్‌సీలో పోస్టుమార్టం చేసేందుకు షెడ్డు ఏర్పాటుకు మంజూరై మూడేళ్లు దాటుతున్న నేటికి నిర్మాణం జరగలేదు. పోస్టుమార్టం అసిస్టెంట్‌ను నియమించి మూడేళ్లు దాటింది. పోస్టుమార్టం లేకపోవడంతో అసిస్టెంట్‌తో ఓపీ స్లిప్పులు రాయిస్తున్నారు. నియోజకవర్గ పరిధిలో ఆకివీడు, ఉండి, కాళ్ల మండలాలకు సంబంధించి ఏడాదికి అనుమానాస్పద మరణాలు సుమారు 40, రహదారుల ప్రమాదాల మరణాలు సుమారు 20 వరకు జరుగుతున్నాయి. ఆకివీడులో పోస్టుమార్టం ఏర్పాటు చేయకపోవడంతో భీమవరం తీసుకెళ్లాల్సి వస్తుంది. మూడు మండలాల పరిధిలో జనాభా సుమారు మూడు లక్షలు వరకు ఉంటారు. రాత్రి సమయాల్లో మరణాలు సంబవించినప్పుడు భీమవరం తీసుకెళ్లేందుకు నరకయాతన పడాల్సి వస్తోంది. ఆసుపత్రిలో జనరల్ మెడిసిన్, జనరల్ సర్జన్, జనరల్ వైద్యులు ఖాళీలుండడంతో వ్యాధిగ్రస్తులు ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే వారి భర్తీకి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు ఆధ్వర్యంలో వేగవంతంగా అభివృద్ధి చేస్తున్నారు. దీనిలో భాగంగా ఆకివీడు సీహెచ్‌సీకి పోస్టుమార్టం మంజూరై మూడేళ్లు గడిచిందని, ఇప్పటికైనా సీహెచ్‌సీలో పోస్టుమార్టం షెడ్డు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



సీహెచ్‌సీలో పోస్టుమార్టం షెడ్డు ఏర్పాటుకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. అంతే కాకుండా ఆసుపత్రికి సంబంధించి వైద్యులను భర్తీ చేయాలనే విషయం తెలిపాం. డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామ సౌజన్యంతో ప్రసూతి వైద్యురాలిని నియమించడంతో ఆపరేషన్లు సక్రమంగా జరుగుతున్నాయి. ఎక్స్ రే, డయాలసిస్ ఏర్పాటుతో జనం సంతోషం చెందుతున్నారు.

- సీహెచ్ ఆదిలక్ష్మి, ఇన్‌చార్జి సూపరింటెండెంట్, ఆకివీడు

ఏలూరులో 'సుందరకాండ' యూనిట్ సందడి


మాట్లాడుతున్న హీరో రోహిత్, చిత్ర యూనిట్ సభ్యులు

ఏలూరు రూరల్,ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రేక్షకులను ఆనందంలో ముంచెత్తే సినిమా 'సుందరకాండ' అని సినీ హీరో నారా రోహిత్ అన్నారు. ఆయన కథానాయకుడిగా రూపొందించిన చిత్రం 'సుందరకాండ' వెంకటేశ్ నిమ్మలపూడి దర్శకుడు. సంతోష్ చిన్నపొల్ల, గౌతమ్ రెడ్డి, రాకేష్ మహంకాళి నిర్మాతలు, ఇటీవల ఈ చిత్రం విడుదలైన అన్ని థియేటర్లలో విజయవంతంగా ప్రదర్శించబడుతుంది. ఈ నేపథ్యంలో చిత్రం యూనిట్ సభ్యులు విజయ యాత్రలో భాగంగా శనివారం ఏలూరులోని క్రాంతి థియేటర్‌లో సందడి చేశారు. ఫస్ట్ షోకి వచ్చి ప్రేక్షకులను పలకరించి, పలు డైలాగ్‌లు చెప్పి సందడి చేశారు. అనంతరం విలేకరుల సమావేశంలో హీరో రోహిత్ మాట్లాడుతూ ఈ సినిమా మంచి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా నిలుస్తోందన్నారు. చిత్రం విజయవంతం చేసిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలిపారు. హీరోయిన్ వ్రితి వాఘాని మాట్లాడుతూ మంచి కంటెంట్‌తో 'సుందరకాండ' విజయాన్ని సొంతం చేసుకుందన్నారు. అనంతరం నిర్మాత సంతోష్ మాట్లాడుతూ సినిమా చాలా అద్భుతంగా వచ్చింది అని అందరూ కుటుంబ సమేతంగా సినిమాను చూడాలని కోరారు.

మార్మోగిన 'గోవింద' నామస్మరణ


భక్తుల సందడి

ద్వారకాతిరుమల, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): గోవింద నామాలతో శ్రీవారి క్షేత్రం శనివారం శోభిల్లింది. స్వామివారికి ప్రీతికరమైన రోజుకావడంతో ఆలయానికి ఉదయం నుంచి భక్తులు వచ్చారు. క్రమేపీ భక్తుల రద్దీ ఆలయంలో పెరిగింది. దాదాపు 20 వేల మంది వరకు భక్తులు వచ్చి ఉంటారని అధికారులు అంచనా వేస్తున్నారు. భక్తులు ముందుగా మొక్కుబడులు తీర్చుకుని స్వామి, అమ్మవార్లను దర్శించి పూజలు జరుపుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఆ తరువాత నిత్యాన్నదాన సదనంలో స్వామివారి అన్నప్రసాదాన్ని తీసుకున్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు దరఖాస్తులు

ఏలూరు అర్బన్,ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి) : తెలుగురాష్ట్రాల్లో ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని హైదరాబాద్‌కు చెందిన 'ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమి' స్థాపక అధ్యక్షుడు డాక్టర్ ఈ.ఎస్.ఎస్.నారాయణ మాస్టారు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అధ్యాపకులు, ఉపాధ్యాయుల ప్రతిభను గుర్తించి టీచర్స్ డే సందర్భంగా వారిని డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జాతీయస్థాయి, రాష్ట్రస్థాయి ఉపాధ్యాయ రత్న అవార్డులతో సత్కరించేందుకు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని లెక్చరర్లు, టీచర్ల నుంచి దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలు, కళాశాలల ప్రిన్సిపాల్స్, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు వారి విద్యార్హతలు, బోధన, శిక్షణ అనుభవాలను తెలిపే సర్టిఫికెట్లు, ఫొటోలు,పత్రికల క్లిప్పింగ్స్‌ను దరఖాస్తుకు జతచేసి సెప్టెంబరు 4వ తేదీలోగా అందించాలన్నారు. ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ, డోర్ నంబరు 1-20-104, గోకుల్‌నగర్, వెంకటాపురం, తిరుమలగిరి పోస్టు, సికింద్రాబాద్-15 చిరునామాకు పంపాలని కోరారు. ఎంపికైన వారికి సెప్టెంబరు 7న హైదరాబాద్‌లో నిర్వహించే కార్యక్రమంలో పురస్కారాలను అందజేస్తామన్నారు. వివరాలకు 96523 47207 నంబరులో సంప్రదించాలని కోరారు.

తెలుగు తెచ్చిన తంటా !



» కేంద్ర విద్యాసంస్థల్లో చదవడమే డీఎస్సీ ఉద్యోగ అవకాశాలను చేజార్చిందని అభ్యర్థుల ఆవేదన

» డీఎడ్, బీఎడ్ పూర్తిచేసినా ఉపాధ్యాయ ఉద్యోగాలకు అనర్హులేనా ?!

ఏలూరుఅర్బన్,ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి):ఉపాధ్యాయ ఉద్యోగ నియామకాలకు పాఠశాల విద్యాశాఖ కొత్తగా పెట్టిన సంస్కరణలు/ మార్గదర్శకాలు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో మెగా డీఎస్సీ-2025 తుది ఎంపికల ముంగిట్లోవున్న ఐదుగురు అభ్యర్థుల ఉద్యోగావకాశాలను ఆవిరిచేసింది. శుక్రవారం ఇదేకోవలో ఇద్దరు మహిళా అభ్యర్థులకు నిర్ణీత అర్హతలు లేవని అనర్హుల జాబితాలో చేర్చగా, తాజాగా శనివారం మరో ఐదుగురిని తిరస్కరణ జాబితాలో ఉంచినట్టు తెలిసింది. సర్టిఫికెట్ల పరిశీలన ముగిసిన నేపథ్యంలో శనివారం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చేపట్టిన పునఃపరిశీలన ప్రక్రియలో గుర్తించిన వీరిని అనర్హులుగా చేసినట్టు సమాచారం. అయితే వీరి అనర్హత ధ్రువీకరణను విద్యాశాఖవర్గాలు బహిర్గతం చేయడం లేదు.

● చివరి నిమిషంలో ఉద్యోగావకాశాలను చేజార్చుకున్న ఈ ఐదుగురు నిరుద్యోగ ఉపాధ్యాయ అభ్యర్థులను అనర్హులుగా చేసిన అంశమేంటంటే.. కేంద్రప్రభుత్వం దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో నిర్వహించే నవోదయ, కేంద్రీయ విద్యాలయ, సీబీఎస్‌ఈ బోధన జరిగే విద్యాసంస్థల్లో పదో తరగతిలో ప్రథమభాష లేదా ఇంటర్మీడియట్‌లో ద్వితీయ భాష లేదా డిగ్రీ కోర్ సబ్జెక్టుల్లో తెలుగుభాష చదవకపోవడమే సంబంధిత డీఎస్సీ కాల్ లెటర్లు అందుకున్న సెలెక్టెడ్ అభ్యర్థులను నియామక ప్రక్రియ నుంచి నెట్టివేసింది.

ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమంలోనే బోధన

గత కొన్నేళ్లుగా రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమంలోనే తరగతుల నిర్వహణ, బోధన జరుగుతోంది. ఈ విషయాన్ని సైతం పరిగణనలోకి తీసుకోకుండా టెన్త్‌లో ప్రథమభాష, ఇంటర్‌లో ద్వితీయభాషగా తెలుగు ఉంటేనే డీఎస్సీ ఉద్యోగాలకు అర్హులని కొత్త విషయాన్ని తెరపైకి తీసుకురావడం నిరుద్యోగ ఉపాధ్యాయ అభ్యర్థులకు ముఖ్యంగా కేంద్ర విద్యాసంస్థల్లో ఎస్‌ఎస్‌సీ, ఇంటర్ పూర్తిచేసిన వారిలో ఒకింత ఆగ్రహం వ్యక్తమవుతున్నాయి. ఇవే షరతులు ముందునుంచీ పెట్టిఉంటే కేంద్ర విద్యాసంస్థల్లో ప్రవేశాలకు పరీక్షలు రాయడం, అడ్మిషన్లు తీసుకోవడం ఎవరూ చేయరని అభ్యర్థులు చెబుతున్నారు. మరోవైపు ఇంటర్మీడియట్ అనంతరం ఉపాధ్యాయ విద్యశిక్షణ కోసం డీఎడ్, డిగ్రీ అనంతరం బీఎడ్ చదివామంటే టీచరు ఉద్యోగాల కోసమేనని, తాజా మార్గదర్శకాలతో డీఎస్సీ నియామకాలకు అనర్హులుగా చేయడం ఎంతవరకు సబబని ప్రశ్నిస్తున్నారు.

ఎఫ్ఏక్యూ.. వివరణేగాని జీవో కాదుగా..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహించిన డీఎస్సీ-2001 రిక్రూట్‌మెంట్ సందర్భంగా జారీఅయిన ఆర్సీ/జీవో ఉత్తర్వులప్రకారం అభ్యర్థుల అర్హతలపై ఎస్సీఈఆర్టీ ఇచ్చిన వివరణ ప్రకారం నవోదయ విద్యాసంస్థల్లో పదో తరగతిలో తెలుగు పాఠ్యాంశాలను చదివిన వారందరినీ ఎస్ఎస్‌సీ స్కీంలో ప్రథమభాష తెలుగును ఎంచుకున్నట్టుగానే పరిగణించాలని స్పష్టం చేశారు. ఇదే ఉత్తర్వు ఇప్పటికీ అమల్లోవున్నట్టుగానే భావిస్తున్నారు. కాగా విద్యాశాఖ తన వాదనను సమర్థించుకునేందుకు ఫ్రీక్వెంట్లీ ఆస్కింగ్ క్వశ్చన్స్ (ఎఫ్ఏక్యూ)ను తెరపైకి తెచ్చింది. మెగా డీఎస్సీ-2025 నిర్వహణపై ఈ నెలలో విద్యాధికారులకిచ్చిన శిక్షణ సందర్భంగా కొందరు లేవనెత్తిన సందేహాలపై ఎఫ్ఏక్యూ రూపంలో వివరణలిచ్చారు. అందులో 8వ ప్రశ్నగా ప్రస్తావనకు వచ్చిన డీఎస్సీ అభ్యర్థుల విద్యార్హతల విషయంలో లాంగ్వేజీ, మీడియంల విషయమై ఇచ్చిన వివరణలో ఎక్కడా నవోదయ, సీబీఎస్‌ఈ, కేంద్రీయ విద్యాలయ, తదితర కేంద్ర విద్యాసంస్థల్లో చదివిన విద్యార్థుల విషయాన్ని ప్రస్తావించకపోవడం గమనార్హం. ఈ వివరణ నుంచి తమకు మినహాయింపు ఉంటుందని అభ్యర్థులు చెబుతున్నారు.

సమంజసమేనా ?

సీబీఎస్‌ఈ, నవోదయ, కేంద్రీయ విద్యాలయ, తదితర కేంద్ర విద్యాసంస్థల్లో ఆంగ్లమాధ్యమంలోనే బోధన జరుగుతుందన్న విషయం అందరికీ తెలిసిందే. ముఖ్యంగా పదో తరగతిలో ప్రథమ భాష ఇంగ్లీషు మాత్రమే ఉంటుంది. మరో భాషను ఎంచుకునే సౌలభ్యం ఉండదు. ఇక ఇంటర్మీడియట్‌లో ద్వితీయ భాషగా తెలుగు ఎంచుకోవడానికి అవకాశం వున్నప్పటికీ అధికమార్కుల కోసం దాదాపు విద్యార్థులందరూ సంస్కృతం లేదా మరో భాషకు ప్రాధాన్యమిస్తారు. అతి స్వల్పసంఖ్యలో మాత్రమే విద్యార్థులు ద్వితీయ భాషగా తెలుగును ఎంచుకుంటారు. రాష్ట్రబోర్డులో చదివిన విద్యార్థుల విషయంలో సమస్య లేకపోయినా కేంద్ర విద్యాసంస్థల్లో టెన్త్, ఇంటర్ వరకు అభ్యసించిన వారి అర్హతల విషయంలోనే మెగా డీఎస్సీ-2025 నియామకాలకు కొత్తగా పెట్టిన సంస్కరణలు సంబంధిత అభ్యర్థులకు ఉపాధ్యాయ ఉద్యోగాల ఆశలపై నీళ్లుచల్లాయి.

జీవో నిబంధనలే పాటిస్తాం

కేంద్ర విద్యాసంస్థల్లో టెన్త్, ఇంటర్మీడియట్ చదివి తెలుగు ప్రథమ, ద్వితీయ భాషలేని అభ్యర్థుల విషయంలో వచ్చిన సమస్యలపై ఉన్నతాధికారులు స్పష్టతనిచ్చారు. విద్యార్హతలు, అనర్హతలకు సంబంధించి ఈ ఏడాది ఏప్రిల్ 19న జారీఅయిన జీవో 15 ఉత్తర్వు 31వ పేజీలో రూల్ నంబరు 4లో నియమ నిబంధనలు చాలా స్పష్టంగా ఉన్నాయి. ఆ నిబంధనలనే డీఎస్సీ నియామకాలకు పాటిస్తున్నాం. వివాదాలకు అతీతంగా పూర్తిపారదర్శకతతో రిక్రూట్‌మెంట్ జరుగుతుంది. ఏ ఒక్కరికీ అన్యాయం జరుగదు.

- ఎం.వెంకట లక్ష్మమ్మ, ఉమ్మడి జిల్లా డీఈవో

భీమవరం స్పెషల్ సబ్ జైలుకు కొత్త కళ

» పెట్రోల్ బంక్ ఏర్పాటుతో ఖైదీలకు ఉపాధి » త్వరలో పచ్చదనంతో ఆహ్లాదకరంగా తీర్చిదిద్దేందుకు అధికారుల కృషి


భీమవరం సబ్ జైల్ ముఖద్వారం.. పక్కనే ప్రారంభించిన పెట్రోల్ బంకు


ఉచిత న్యాయ సేవా సహాయ కేంద్రం

భీమవరం క్రైం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): పురాతనమైన భీమవరం స్పెషల్ సబ్ జైలుకు ప్రస్తుతం కొత్త కళ వచ్చింది. ఎప్పటి నుంచో పాత సబ్ జైల్‌లోనే రిమాండ్ ఖైదీలను ఉంచేవారు. ఇటీవల దానిని మార్పు చేసి సెంట్రల్ బ్యాంక్‌లోని సీఎస్ఆర్ ఫండ్స్ ద్వారా అధునాతనంగా తీర్చిదిద్దేందుకు జైలు సూపరింటెండెంట్ దుంపల వెంకటగిరి ముందుకు కదిలారు. ఈమేరకు జైలు వాతావరణం మొత్తం మారిపోయింది. ఖైదీలు ఉండేందుకు అధునాతనంగా సదుపాయాలను ఏర్పాటు చేశారు. గతంలో 62 మంది ముద్దాయిలు, 8 మంది మహిళా ముద్దాయిలకు వసతులు అందుబాటులో ఉండేవి. ప్రస్తుతం 70 మంది ముద్దాయిలకు 20 మంది మహిళా ముద్దాయిలకు వసతులు కల్పించేలా చర్యలు చేపట్టారు. మహిళా ముద్దాయిలు ఉండేందుకు నాలుగు స్పెషల్ బ్లాక్‌లను ఏర్పాటు చేశారు. వీడియో లింకేజీ రూమ్, స్టోర్ రూమ్, అధునాతనమైన బాత్‌రూమ్‌లు వంటి వాటిని ఏర్పాటు చేశారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సహకారంతో పెట్రోల్ బంకును ఏర్పాటు చేసి ఖైదీల అభ్యున్నతికి ఎంతగానో కృషి చేస్తున్నారు. స్థలాన్ని జైలు అధికారులు ఇవ్వడంతో ఐఓసీ సంస్థ కొంత పెట్టుబడితో పెట్రోల్ బంక్‌ను ఏర్పాటు చేసింది. వచ్చిన ఆదాయాన్ని ఖైదీల సంక్షేమ నిధిలో జమ చేస్తున్నారు. పెట్రోల్ బంకు ఏర్పాటుకు సుమారు కోటి రూపాయల వరకు వెచ్చించారు. జైలును అధునాతనంగా తీర్చిదిద్దేందుకు కోటిన్నర రూపాయల వరకు వెచ్చించారు. త్వరలోనే జైలులో మొత్తం పచ్చదనాన్ని ఆహ్లాదకరంగా చేసేందుకు అన్నీ సిద్ధం చేశామని తెలిపారు. పెట్రోల్ బంకులో పని చేసేందుకు రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు నుంచి ఆరుగురు ఖైదీలను డీఐజీ, ఎస్పీ ఆధ్వర్యంలో ఎంపిక చేసి బంక్‌లో పని చేసేందుకు చర్యలు తీసుకున్నారు. ఈవిధంగా పనిచేసే ఖైదీలకు 8 గంటలు విధులకు గాను రూ.200 నగదును చెల్లించే విధంగా చర్యలు చేపట్టారు. వీరికి శిక్ష కూడా తగ్గుతుందని తెలిపారు.

తాడేపల్లిగూడెంలో వయోవృద్ధుల ట్రిబ్యునల్



ఆర్డీవోతో మాట్లాడుతున్న సీనియర్ సిటిజన్స్

తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు వయో వృద్ధుల పోషణ సంక్షేమ చట్టం 2007 ప్రకారం వయోవృద్ధుల ట్రిబ్యునల్‌ను శనివారం ఏర్పాటు చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో ఆర్డీవో చైర్మన్‌గా ఈ ట్రిబ్యునల్ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆర్డీవో ఖతీబ్ కౌసర్ భనోను కన్సిలియేషన్ అధికారులు కొటికలపూడి చిట్టి వెంకయ్య, ఎండి ముస్తఫా, వంగపండు రామ్మోహన్, సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు అడ్డాల నాగ సూర్యనారాయణ తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి ట్రిబ్యునల్ నిర్వహణపై చర్చించారు.

మహిళలకు యోగాసన పోటీలు

తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి):తాడేపల్లిగూడెంలో శనివారం అస్మిత యోగాసన ఉమెన్ సిటి లీగ్ పోటీలు శనివారం చాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా 18 సంవత్సరాల లోపు మహిళల వ్యక్తిగత బెండింగ్, 18 ఏళ్ల పైబడిన వ్యక్తిగత బెండింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 250 మంది మహిళలు పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన యోగాసన స్పోర్ట్స్ అథారిటి ఏపీ ప్రెసిడెంట్ ఎ.రాధిక పాల్గొని మాట్లాడుతూ ఈ యోగాసన పోటీల్లో మహిళలు రాణిస్తు అన్ని రంగాల్లో దూసుకు పోతున్నారన్నారు. కార్యక్రమంలో సిటి లీగ్ కోఆర్డినేటర్ రామకృష్ణ, జీఎంఆర్ విద్యా సంస్థల అధినేత లక్ష్మీనారాయణ, కాంపిటేషన్ డైరెక్టర్ సీహెచ్ సుధాదేవి, లీగ్ మేనేజర్ అంబిక పాల్గొన్నారు.

సాంకేతికతతో ఉన్నత స్థాయికి ఎదగవచ్చు



రోల్ ఆఫ్ హానర్ అందుకుంటున్న విద్యార్థిని లలితా నాగరత్నం

తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): సృజనతో కూడిన సాంకేతికతతో ముందుకు వెళ్తే విద్యార్థులకు అవకాశాలు వెతుక్కుంటూ వస్తాయని జేఎన్‌టీయూ కాకినాడ విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ సీఎస్ఆర్‌కే డాక్టర్ ప్రసాద్ పేర్కొన్నారు. పెదతాడేపల్లి శ్రీ వాసవి ఇంజనీరింగ్ కళాశాలలో గ్రాడ్యుయేషన్‌డే వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిగ్రీ పూర్తిచేసిన విద్యార్థులకు ఉపకులపతి పట్టాలు అందించారు. వివిధ బ్రాంచిల్లో ప్రథమ స్థానం సాధించిన వి.సాత్విక్, వి జ్యోత్స్నా రాణి, ఆర్ఎం సాయివరలక్ష్మి, వి.మానస, కె.నవ్యామాధురి, వినయ్‌కుమార్, బి.శుశ్రుత, రోల్ ఆఫ్ హానర్‌గా కె నాగలలితా రత్నం గుత్తికొండ సత్యశ్రీలకు బంగారు పతకాలు అందించారు. ఈ సందర్భంగా పెన్నాంట్ టెక్నాలజిస్ డైరెక్టర్ దాట్ల రవివర్మ, డాక్టర్ శ్రీధర్, కళాశాల పాలకవర్గ అధ్యక్ష కార్యదర్శులు గ్రంధి సత్యనారాయణ, చలంచర్ల సుబ్బారావు, ట్రిఫ్ లిమిటెడ్ డైరెక్టర్ ఓపి గోయెంకా మాట్లాడారు.

ఆక్రమణలపై ఉక్కుపాదం



చెరుకువాడ బస్టాండ్ ప్రాంతంలో ఆక్రమణలు పరిశీలిస్తున్న డిప్యూటీ స్పీకర్

ఉండి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ఆక్రమణలపై ఉక్కుపాదం మోపాలని డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామ కృష్ణరాజు ఆదేశించారు. చెరుకువాడ బస్టాండ్ ఏరియాలో ఆక్రమణలను ఆయన పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. జాతీయ రహదారి, ఆర్అండ్‌బి రహదారులను, ప్రభుత్వ భూముల వివరాలు ఆయన అడిగి తెలుసుకున్నారు. ఆక్రమణలకు గురైన బస్టాండ్ ప్రాంతాన్ని పరిశీలించి తొలగించాలని అన్నారు. ఏ ప్రాంతంలో ఆక్రమణలు ఉండటానికి వీలులేదన్నారు. సర్పంచ్ కొండవీటి సాంబశివరావు, డిప్యూటీ తహసీల్దారు కూనపరాజు సూర్యనారాయణరాజు, రెవెన్యూ అధికారులు, ఎస్ఐ నజీరుల్లా పాల్గొన్నారు.

డిప్యూటీ స్పీకర్‌కు స్వామిజీల ఆశీస్సులు

ఆకివీడు: పిఠాపురంలోని దత్త క్షేత్రంలో డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామ కృష్ణరాజు కుటుంబీకులు శనివారం సచ్చిదానంద, విజయానంద స్వామీజీలను దర్శించుకొని ఆశీస్సులు పొందారు. పిఠాపురంలో యాభై రోజులుగా చాతురమాస వ్రతదీక్షను నిర్వహిస్తున్నారు. డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు, సతీమణి రమాదేవి, తనయుడు భరత్ దర్శించుకొని స్వాముల ఆశీస్సులు పొందారు.

ఉద్యాన వర్సిటి పరిశోధనా రంగానికి అవార్డు

తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): వెంకట్రామన్నగూడెంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యానవర్సిటి సుపరిపాలన విభాగంలో అంబాజీపేట ఉద్యాన పరిశోధనా స్థానం కీటక యాజమాన్యంలో మిత్ర పురుగుల ఉత్పత్తి ప్రాజెక్టు జాతీయ స్కోచ్ అవార్డు దక్కించు కుంది. ఏడు పరిశోధనా ప్రాజెక్టులు ఈ పోటీలో తలపడగా కొవ్వూరు నుంచి సాంప్రదాయ అరటి రకాలలో నాణ్యమైన మొక్కల ఉత్పత్తి, అంబాజీపేట నుంచి కొబ్బరిలో త్వరగా కాపుకు వచ్చే హైబ్రిడ్ మొక్కల తయారీ, జీవ నియంత్రణ పద్ధతులతో కిటక యాజమాన్యం, చిని నిమ్మ పరిశోధనాస్థానం నుంచి నిమ్మలో అధిక ఆదాయం ఇచ్చే సౌత్ గుడి బాలాజి రకాల మొక్కల తయారీ ప్రాజెక్టులకు ఆర్డర్ ఆఫ్ మెరిట్ సర్టిఫికెట్ సాధించాయి. ఈ సందర్భంగా అవార్డు సాధించేందుకు కృషిచేసిన పరిశోధనా స్థానాల శాస్త్రవేత్తలను ఉపకులపతి గోపాల్ అభినందించారు.

అభివృద్ధి లక్ష్య సాధనకు కృషి చెయ్యాలి

భీమవరం టౌన్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సుస్థిర అభివృద్ధి లక్ష్య సాధనకు అధికారులు సమష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. శనివారం భీమవరం ఎంపీడీవో కార్యాలయంలో జిల్లా పంచాయతీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఒక రోజువర్క్ షాపుకు జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని సంబంధిత శాఖల అధికారులకు దిశానిర్దేశం చేశారు. భారతదేశం సూపర్‌పవర్‌గా ఎదగాలంటే లక్ష్యాలను సాధించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. స్త్రీ పురుష సమానత్వం, అందరికీ ప్రాథమిక విద్య, వైద్యం, తదితర అంశాలలో బేసిక్ లక్ష్యాలను పెట్టుకొని లక్ష్య సాధనకు ముందుకు వెళ్లాలన్నారు.

మామిడిలో యాజమాన్య పద్ధతులు పాటించాలి

మొగల్తూరు, ఆగస్టు 30 (ఆంధ్ర జ్యోతి):మామిడి రైతులు యాజమా న్య పద్ధతులు పాటిస్తే అధిక దిగు బడి సాధించవచ్చని జిల్లా ఉద్యాన వన అధికారి ప్రభాకరరావు సూచిం చారు. రామన్నపాలెంలో సర్పంచ్ బందెల ఎలీషా అధ్యక్షతన జరిగిన మామిడి రైతుల అవగాహన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఉద్యానవన శాస్త్రవేత్త బిందు ప్రవీణ్ మాట్లాడు తూ మామిడి తోటల పెంపకానికి గల సస్యరక్షణ చర్యలు వివరించారు.

ఏఎంసీలోనే కలెక్టరేట్ నిర్మాణం జరగాలి



భీమవరంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశానికి హాజరైన అఖిలపక్ష నాయకులు

» అఖిలపక్ష సమావేశం డిమాండ్
» ప్రజలకు ఆమోదయోగ్యమైన ప్రాంతంలోనే నిర్మాణం
» ఎమ్మెల్యే అంజిబాబు తెలిపారన్న జనసేనాని వబిలిశెట్టి

భీమవరం టౌన్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టరేట్‌కు గత ప్రభుత్వ హయాంలో భీమవరం పట్టణంలోని ఏఎంసీ ప్రాంగణంను కేటాయించారని అక్కడే కలెక్టరేట్‌ను నిర్మించాలని శనివారం చాంబర్ ఆఫ్ కామర్స్‌లో నిర్వహించిన అఖిలపక్ష సమావేశం డిమాండ్ చేసింది. వైసీపీ నాయకులు చినమిల్లి వెంకట రాయుడు, నాయకులు గూడూరి ఉమాబాల, వేండ్ర వెంకటస్వామి, కామన నాగేశ్వరరావు, సీపీఐ నాయకులు కోనాల భీమారావు, చెల్లబోయిన రంగారావు, మల్లుల సీతారామ ప్రసాద్, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ నాయకులు లంకా కృష్ణమూర్తి, గుడూరి ఉమాబాల, కర్రి ప్రేమకుమార్, జి. జేమ్స్, బీఎస్పీ నాయకులు మురాల రత్నరాజు, మాజీ కౌన్సిలర్ భూసారపు సాయి సత్యనారాయణ, గంటా సుందర్ కుమార్, చిగురుపాటి స్వామి రాజు తదితరులు మాట్లాడారు. కలెక్టరేట్ ఇప్పటికప్పుడు నిర్మించడానికి అభివృద్ధి చెందిన ఏఎంసీ ప్రాంగణం ఉండగా కలెక్టరేట్ నిర్మాణానికి మరో ప్రాంతం అవసరం లేదన్నారు. జిల్లాలోని అన్ని శాసనసభ నియోజక వర్గాలకు ఏఎంసీ ప్రాంగణం కేంద్ర బిందువుగా ఉందన్నారు. పట్టణంలో ఉండవలసిన కలెక్టరేట్‌ను ఎక్కడో మరో నియోజకవర్గంలోకి అందునా గ్రామంలోకి తీసుకువెళ్లాలన్న వివాదాస్పద ప్రతిపాదనలు ఎందుకు చేస్తున్నారని అఖిలపక్ష, ప్రజా సంఘాల నాయకులు ప్రశ్నించారు. ఉండి నియోజకవర్గ ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు తన నియోజకవర్గంలోని తన ప్రాంతంలోనే కలెక్టరేట్‌ను నిర్మించాలన్న పంతాలు వదులు కోవాలని కోరారు.

జనసేన సమావేశానికి ఎమ్మెల్యే అంజిబాబు వైజాగ్ వెళ్లారని, ఆయన ప్రతినిధిగా హాజరైన జనసేన నాయకుడు వబిలిశెట్టి రామకృష్ణ అఖిలపక్ష సమావేశానికి వచ్చి శాసనసభ్యుడి అభిప్రాయాన్ని తెలిపారు. పట్టణం, పట్టణ పరిసరాల్లోనే కలెక్టరేట్ నిర్మాణం జరుగుతుందని, గతంలో ఇచ్చిన జీవో ప్రకారం అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ కానీ, మరింతగా ప్రజలకు అనువుగా, ఆమోదయోగ్యంగా ఉండే ప్రాంతంలోనే కలెక్టరేట్ నిర్మాణం జరుగుతుందని, కలెక్టరేట్ శంకుస్థాపనకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వస్తారని, ఆయనతోనే కలెక్టరేట్ శంకుస్థాపన జరుగుతుందని ఎమ్మెల్యే అంజిబాబు తెలిపారని రామకృష్ణ వివరించారు.



గన్ని వీరాంజనేయులుకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

గణపవరాన్ని 'పశ్చిమ'లోనే ఉంచండి

ఆప్కాబ్ చైర్మన్‌కు గణపవరం అఖిలపక్ష నేతల వినతి

భీమడోలు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి):గణపవరం మండలాన్ని పశ్చిమ గోదావరి జిల్లాలోనే ఉంచాలని అందుకు సహకరించాలంటూ గణపవరం అఖిలపక్షం నేతలు ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులుకు వినతి పత్రాన్ని అందజేశారు. ఆయన క్యాంపు కార్యాలయంలో శనివారం ఈ మేరకు అఖిలపక్ష నేతలు విన్నవించారు. తమ డిమాండ్‌ను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరగా తన వంతు కృషి చేస్తామని గన్ని వారికి హామీ ఇచ్చారు.

నేడు జిల్లా కేంద్రం కోసం జేఏసీ సమావేశం

నరసాపురం, ఆగస్టు 30 (ఆన్‌లైన్): నరసాపురాన్ని జిల్లా కేంద్రం చేయాలన్న నినాదంతో ఆదివారం జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశం కానుంది. కమిటీ కన్వీనర్ నెక్కంటి సుబ్బారావు ఆధ్వర్యంలో జనసేన పార్టీ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు సమావేశం కానున్నారు. దీనికి ప్రభుత్వం విప్ నాయకర్, మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడుతో పాటు డాక్టర్లు, వ్యాపారులు, న్యాయవాదులు, వివిధ పార్టీల నాయకులు, కార్మిక సంఘాల నాయకులు హాజరుకానున్నట్లు నెక్కంటి చెప్పారు. భవిష్యత్ కార్యాచరణపై చర్చిస్తామన్నారు. ఇప్పటికే జిల్లా కేంద్రం కోసం మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు ఆధ్వర్యంలో పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించి, విప్ నాయకర్‌ను కలిసారు. దీనిపై నాయకర్ కూడా సానుకూలం స్పందించారు.



కనక రత్నం చిత్రపటం వద్ద చిరంజీవి అభిమానుల నివాళి

అల్లు రామలింగయ్య సతీమణి మృతితో..

పాలకొల్లులో విషాద చాయలు

పాలకొల్లు టౌన్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ప్రముఖ హాస్య నటుడు, పద్మశ్రీ అల్లు రామలింగయ్య సతీమణి అల్లు కనక రత్నం (94) శుక్రవారం రాత్రి హైదరాబాద్‌లో మృతి చెందారన్న వార్తతో పాలకొల్లులో విషాద చాయలు అలుముకున్నాయి. ఆమె స్వగ్రామం పాలకొల్లు. పట్టణంలోని సుబ్బారాయుడు గుడిసెంటర్‌లోని ముత్తిరెడ్డి వారి ఆడపడుచు కనక రత్నం. ఆమె 14వ ఏట అల్లు రామలింగయ్యతో వివాహం జరిగింది. అల్లు రామలింగయ్య నాటక రంగం నుంచి సినీ రంగంలో ప్రవేశించిన అనంతరం మద్రాసు వెళ్లిపోయారు. కనకరత్నం మృతి పట్ల మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు, మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్, మాజీ ఎంపీ చేగొండి హరి రామజోగయ్య, మాజీ ఎమ్మెల్యేలు అల్లు వెంకట సత్యనారాయణ, డాక్టర్ బాబ్జీ, బంగారు ఉషారాణి, ఏఎంసీ మాజీ చైర్మన్ భగవాన్‌రాజు, ముత్యాల శ్రీనివాస్, పెచ్చెట్టి బాబు తదితరులు సంతాపం వ్యక్తం చేశారు. కాగా మెగాస్టార్ చిరంజీవి అభిమాన సంఘం నాయకుడు తులా రామలింగేశ్వర రావు ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ రోడ్డులోని అల్లు రామలింగయ్య విగ్రహం వద్ద కనక రత్నం చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. శిడగం సురేంద్ర, విన్నకోట గోపి, చేబ్రోలు కృష్ణ మోహన్, మద్దాల గణేష్, ముచ్చర్ల రమేష్, సాంబ తదితరులు పాల్గొన్నారు.

వికారాబాద్ మీదుగా 'నాగర్‌సోల్' మళ్లింపు

నరసాపురం, ఆగస్టు 30(ఆన్‌లైన్): భారీ వర్షాల కారణంగా నరసాపురం - నాగర్‌సోల్ ఎక్స్‌ప్రెస్‌ను శనివారం రూట్ మళ్లించారు. తెలంగాణలోని కామారెడ్డి వద్ద ట్రాక్ కొట్టుకుపోవడంతో శుక్రవారం చర్లపల్లి వరకే ఈ ఎక్స్‌ప్రెస్‌ను నడిపారు. ట్రాక్ పనులు ఇంకా పూర్తి కాకపోవడం, వరదలు కొనసాగుతుండటంతో వికారాబాద్ మీదుగా నడపాలని నిర్ణయించారు.



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభిస్తున్న దృశ్యం

'మునిపల్లె' సాహిత్యం ఆదర్శనీయం

పెనుగొండ, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మునిపల్లె రాజు తెలుగు సాహిత్యం భవిష్యత్తుతరానికి ఆదర్శనీయమని ఎస్‌వీకేపీ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ కె. రామచంద్రరాజు అన్నారు. పెనుగొండలోని ఎస్‌వీకేపీ అండ్ డాక్టర్ కెఎస్ రాజు ఆర్ట్స్, సైన్స్ కళాశాల ఆధ్వర్యంలో కేంద్ర సాహిత్య అకాడమీ సౌజన్యంతో తెలుగు విభాగం ఆధ్వర్యంలో కథకుడు, కవి మునిపల్లి రాజు శత జయంతి ఉత్సవం ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీవీ అప్పారావు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. కళాశాల అధ్యక్షుడు టి. నాగిరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మునిపల్లి కుమార్తె కె.లక్ష్మీప్రసన్న మాట్లాడుతూ తన తండ్రి శత జయంతి ఉత్సవం పుణ్య క్షేత్రమైన పెనుగొండలో జరగడం ఆనందంగా ఉందన్నారు. తెలుగు సాహితీ అకాడమీ సలహా మండలిలో ముఖ్యపాత్ర పోషిస్తున్న మృణాళిని మునిపల్లె రాజు రచనలు ఆదర్శనీయమన్నారు. రచయిత వాడ్రేవు చిన వీరభద్రుడు మాట్లాడుతూ రాజు మానవీయ కవి అన్నారు. కన్వీనర్ రంకిరెడ్డి రామ్మోహనరావు, ఎన్‌డీవీ వర ప్రసాద్ అతిథులను సన్మానించారు. అధ్యాపకులు సురేష్, సుబ్బారావు వందన సమర్పణ చేశారు.



కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మను సత్కరిస్తున్న దృశ్యం

డీఎన్నార్ అభివృద్ధికి సహకారం : మంత్రి వర్మ

భీమవరం టౌన్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): డీఎన్నార్ పూర్వ విద్యార్థిగా, కేంద్ర మంత్రిగా డీఎన్నార్ విద్యా సంస్థలకు తన వంతు సహాయాన్ని అందిస్తానని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. డీఎన్ఆర్ అలుమ్ని అసోసియేషన్ ఆధ్వర్యంలో డీఎన్నార్ పూర్వ విద్యార్థుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు ప్రొఫెసర్ వీఎస్ రాజు మాట్లాడుతూ ఈ విద్యా సంస్థల అభివృద్ధికి సహకరిస్తానన్నారు. పాలకవర్గ అధ్యక్షుడు గోకరాజు వెంకట నరసింహరాజు మాట్లాడుతూ నాడు దంతులూరి నారాయణరాజు, ధార్మిక వేత్తల సహకారంతో ఏ ఆశయాలతో కళాశాలను ప్రారంభించారో వాటిని నేటి వరకూ ఆచరిస్తున్నామన్నారు. మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు మాట్లాడుతూ విద్యా సంస్థల అభివృద్ధిలో పూర్వ విద్యార్థుల పాత్ర ఎనలేనిదన్నారు. ఎమ్మెల్సీ గోపిమూర్తి, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, డీఎన్నార్ పాలకవర్గ కార్యదర్శి, కరస్పాండెంట్ గాదిరాజు సత్యనారాయణరాజు (బాబు), డీఎన్నార్ పాలకవర్గ ఉపాధ్యక్షుడు గోకరాజు పాండు రంగరాజు మాట్లాడారు.

అత్తింటి వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య

పెనుగొండ, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): అత్తింటివారి వేధింపులు తాళలేక ఒక వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పెనుగొండ మండలం దొంగరావిపాలేనికి చెందిన కోన నాగేంద్ర పెనుగొండ దొంగగూడేనికి చెందిన హేమ(27)తో నాలుగేళ్ల క్రితం వివాహమైంది.ఈమె వివాహం జరిగి నాలుగేళ్లు అయినా పిల్లలు లేకపోవడంతో అత్త మామలు, భర్త మానసికంగా వేధింపులు ఎక్కువయ్యాయి. ఈ క్రమంలో హేమ ఈ నెల 28న ఇంట్లో పురుగుల మందు తాగడంతో కుటుంబ సభ్యులు గమనించి తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో గురువారం మృతి చెందింది. భర్త, అత్త మామలే పురుగుల మందు తాగించి హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని హేమ తరపు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు ఎస్ఐ గంగాధరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



ప్రమాద స్థలంలో నాగేశ్వరరావు మృతదేహం

మోటార్ సైకిల్‌ను ఢీకొట్టిన ట్రావెల్ బస్సు

భర్త అక్కడికక్కడే మృతి, భార్యకు తీవ్రగాయాలు

భీమడోలు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): దైవదర్శనానికి వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో భర్త మృతి చెందగా భార్యకు తీవ్ర గాయాలయ్యాయి. భీమడోలు జాతీయ రహదారిపై ఈ ఘటన చోటు చేసుకుంది. ఉండి మండలం పొందువ్వ గ్రామానికి చెందిన కంచరపు నాగేశ్వరరావు(62), తన భార్య సూర్యకాతంతో మోటారు సైకిల్‌పై ద్వారకాతిరుమల ఆలయానికి బయల్దేరారు. భీమడోలు హైవేపై ఉన్న కనకదుర్గమ్మ ఆలయం వద్దకు చేరుకున్నారు. ముడుపులు పూళ్లలోని బంధువుల ఇంట్లో మర్చిపోవడంతో మోటారు సైకిల్‌ను డివైడర్ వైపు తిప్పి వెళ్లేందుకు ప్రయత్నించగా తాడేపల్లిగూడెం వైపు వెళుతున్న ట్రావెల్ బస్సు వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో భర్త నాగేశ్వరరావు అక్కడికక్కడే మృతి చెందగా భార్యకు తీవ్రగాయాలు అయ్యాయి. ఏలూరు ఆసుపత్రికి తరలించారు. కుమారుడు దుర్గా ప్రసాద్ ఫిర్యాదు మేరకు భీమడోలు ఎస్ఐ సుధాకర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యాపారంలో నష్టాలు రావడంతో ఆత్మహత్య

పెదపాడు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): చేస్తున్న వ్యాపారంలో నష్టాలు రావడంతో చేసిన అప్పులు తీర్చలేక ఒకరు ఆత్మహత్య చేసుకున్నాడు. పెదపాడు మండలం కలపర్రు గ్రామానికి తుంగల వెంకన్న బాబుకు పుట్టుకతోనే కాళ్లు చచ్చుబడ్డాయి. వస్త్ర వ్యాపారంతో పాటు బడ్డీకొట్టు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆయా వ్యాపారాల్లో నష్టం రావడం, ఇటీవల అనారోగ్య సమస్యలు ఎక్కువ కావడంతో ఈ నెల 29న పురుగు మందు తాగడంతో ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. భార్య నాగమణి ఫిర్యాదు మేరకు ఎస్.ఐ. కట్టా శారదా సతీశ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ వ్యర్థాల తరలింపు వాహనాల పట్టివేత

పెదపాడు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): చేపల చెరువుల్లో మేతగా వేసేందుకు చికెన్ వ్యర్థాలను వాహనాల్లో చెరువులకు తరలిస్తుండగా, పెదపాడు పోలీసులు పట్టుకున్నారు. వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన తనిఖీల్లో రెండు వాహనాలు పట్టుబడినట్టు పెదపాడు ఎస్.ఐ. కట్టా శారదా సతీశ్ తెలిపారు. వాహనాలను, వాహనాల్లోని చికెన్ వేస్ట్‌ను స్వాధీనం చేసుకుని వాహన యజమానులు, డ్రైవర్లపై పెదపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



సదస్సులో పాల్గొన్న న్యాయమూర్తులు, న్యాయవాదులు, ఉద్యోగులు, విద్యార్థులు



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న జిల్లా జడ్జి శ్రీదేవి

చట్టాలపై అవగాహన అవసరం

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి

ఏలూరు క్రైం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): సత్వర న్యాయం కోసం చట్టాలపై అవగాహన అవసరమని, పేదరిక నిర్మూలన కోసం అమలవుతున్న సంక్షేమ పథకాలపై ప్రతి ఒక్కరు అవగాహన పెంపొందించుకోవాలని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీదేవి అన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యూమాడ్యూల్ లీగల్ సర్వీస్ క్యాంపు ఆన్ నల్సా స్కీములపై అవగాహన సదస్సును ఏలూరు జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టర్ వెట్రిసెల్వి, ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి, జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప శివ కిషోర్‌లు పాల్గొన్నారు. ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి మాట్లాడుతూ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో భీమడోలు, తాడేపల్లిగూడెం, చింతలపూడి, భీమవరం,నరసాపురం, తణుకు, కొవ్వూరు, పాలకొల్లు, నిడదవోలు మండల సేవా సంస్థల సేవా కమిటీలు పనిచేస్తున్నాయన్నారు. జిల్లాలో మీడియేషన్ సెంటర్లను ఏర్పాటు చేసి 49 మంది మీడియేటర్లను నియమించామని, తద్వారా 1086 కేసులు పరిష్కారం చేశామన్నారు. జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో వివిధ శాఖల ద్వారా పేదరిక నిర్మూలనకు అమలు చేస్తున్న పథకాలు, కార్యక్రమాలు వివరించారు. ఎస్పీ ప్రతాప శివ కిషోర్ మాట్లాడుతూ పేద ప్రజలకు మెరుగైన సేవలు అందించడం ద్వారా వారిలో విశ్వాసం పెంపొందించవచ్చునన్నారు. ఆ దిశగా జిల్లా పోలీసు యంత్రాంగం న్యాయ వ్యవస్థతో కలిసి పనిచేస్తోందని తెలిపారు. సమాజానికి చేటు చేస్తున్న డ్రగ్స్ నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టామన్నారు. డ్రగ్స్ నియంత్రణకు ఇప్పటికే పాఠశాలలు, కళాశాలలు, విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు, పాఠశాలలు, కళాశాలలో 877 ఈగల్ క్లబ్‌లను ఏర్పాటు చేశామన్నారు. వివిధ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలపై వివిధ రకాల స్టాల్స్‌ను జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీదేవి, కలెక్టర్ కె వెట్రిసెల్వి, జిల్లా ఎస్పీ కెపిఎస్ కిషోర్ సంయుక్తంగా ప్రారంభించి పరిశీలించారు. అనంతరం డీఎల్ఎస్ఎ న్యాయ సదస్సు, డీఆర్డీఏ, డీపీట, పోలీసు, వైద్య ఆరోగ్యశాఖ, విభిన్న ప్రతిభావంతులు, సోషల్ వెల్ఫేరు, బిసి వెల్ఫేరు స్టాల్స్‌ను పరిశీలించారు. ఇతర న్యాయమూర్తులు, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు కోనె సీతారామ్, జిల్లా డీఆర్డీఏ పీడీ ఆర్ విజయరాజు, ప్రముఖ సీనియర్ న్యాయవాది కానాల రామకృష్ణారావు, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, న్యాయవాదులు, ప్రజలు, మహిళలు, విద్యార్థులు, జిల్లా కోర్టు ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటెలిజెన్స్ హెచ్‌సీ సుబ్బారావు మిస్సింగ్

బుట్టాయగూడెం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ఇంటిలిజెన్సీ హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న బుడుపుల సుబ్బారావు కనిపించడం లేదంటూ కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. బుట్టాయగూడెం మండలానికి చెందిన సుబ్బారావు కామవరపుకోట, టి.నర్సాపురం మండలాల్లోని పోలీస్ స్టేషన్లలో ఇంటిలిజెన్సీ హెచ్‌సీగా పనిచేస్తున్నారు. కామవరపుకోటలో రూమ్‌లో ఉంటున్న సుబ్బారావుకు శుక్రవారం రాత్రి కుటుంబ సభ్యులు ఫోన్ చేయగా ఫోన్ అందుబాటులో లేదని సమాధానం రావడంతో ఆందోళనకు గురయ్యారు. చుట్టు పక్కలవారిని కుటుంబ సభ్యులు ఆరా తీయగా శుక్రవారం రాత్రి 10.30 గంటల వరకు కామవరపుకోట చెక్‌పోస్టు వద్ద ఉన్నారని తర్వాత ఎటు వెళ్లారో తెలియదని చెప్పినట్లు కుటుంబ సభ్యులు తెలియజేశారు. శనివారం ఉదయం స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో సుబ్బారావు కోసం గాలింపు చర్యలు ప్రారంభించారు. ఫోన్ ట్రాప్ చేయగా టి.నర్సాపురం మండలం లక్ష్మీపురం, జంగారెడ్డిగూడెం మండలం తాడువాయి ప్రాంతాల్లో సిగ్నల్స్ చూపుతోందని పరిసర ప్రాంతాల్లోనే పోలీసులు వెదుకులాడుతున్నారు. ఈ మేరకు కుటుంబ సభ్యులు తడికలపూడి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

మహిళపై తండ్రీ, కొడుకుల దాడి

కైకలూరు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మహిళపై తండ్రీ, కొడుకులు దాడి చేయడంతో ఆస్పత్రి పాలైంది. కైకలూరు మండలం గుమ్మళ్లపాడు గ్రామానికి చెందిన మరియమ్మ ఇంటి చుట్టూ కట్టుకున్న రక్షణ దడులను పశువులు పాడుచేయడంతో తిట్టుకుంది. అదే గ్రామానికి చెందిన కొండపల్లి మాణిక్యాలరావు,అతని కుమారుడు తమనే తిడుతున్నావంటూ కర్రతో దాడి చేశారు. దాడిలో గాయపడిన ఆమెను కైకలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధితురాలి ఫిర్యాదుతో ఎస్.ఐ. వి.రాంబాబు కేసు నమోదు చేశారు.

అత్తింటి వేధింపులపై ఫిర్యాదు

ముదినేపల్లి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): భర్త, అత్తింటివారి వేధింపులు తట్టుకోలేక ఒక వివాహిత పుట్టింటికి చేరింది. ముదినేపల్లి మండలం పెయ్యేరు గ్రామానికి చెందిన పెందుర్తి మౌనికకు హైదరాబాద్ రామచంద్రపురంలోని అశోక్ నగర్‌కు చెందిన మేత్రా అనిల్ కుమార్‌తో ఏడాది క్రితం వివాహమైంది. అదనపు కట్నం కోసం మౌనికను వేధించడంతో పుట్టింటికి వచ్చింది. శనివారం ముదినేపల్లి పోలీసులకు ఆమె ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి ఎస్ఐ వీరభద్రరావు దర్యాప్తు చేస్తున్నారు.



బస్సు, లారీ ఢీకొన్న దృశ్యం

ఆర్టీసీ బస్సు, లారీ ఢీ..

ఆకివీడు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ఆకివీడు ఎస్.టర్నింగ్‌లో ఆర్టీసీ బస్, లారీ ఢీ కొన్నాయి. ట్రాఫిక్ నిలిచింది. పోలీసులు వచ్చి క్లియర్ చేశారు. ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ భీమవరం నుంచి ఏలూరు వెళ్తోంది. లారీ ఆకివీడు నుంచి భీమవరం వెళ్తోంది. స్థానిక ఎస్ టర్నింగ్‌కు వచ్చే సరికి లారీ ఆర్టీసీ బస్సును ఢీ కొన్నాయి. ఈ ఘటనలో బస్సు వెనుక భాగం పాక్షికంగా ధ్వంసమైంది. దీంతో సుమారు అరగంట పాటు లారీ, బస్సు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తరచూ ఈ ప్రాంతంలో ప్రమాదాలు జరుగుతున్నా పాలకులు, అధికారులు సమస్యను పరిష్కరించడంలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పేదలకు సీఎం సహాయనిధి చెక్కుల అందజేత

ఏలూరుటూటౌన్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): వైద్యం చేయించుకోలేని నిరుపేదల కోసం కూటమి ప్రభుత్వం సీఎం సహాయ నిధి ఏర్పాటు చేసిందని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేసిన అనంతరం మాట్లాడుతూ ఎల్ఓసీ ద్వారా ఐదుగురికి రూ.20లక్షల 50వేలు అందజేశామన్నారు. చెక్కుల రూపేణ 34మందికి రూ.46 లక్షల 38వేలు పంపిణీ చేశామన్నారు. ఏఎంసీ చైర్మన్ పార్థసారథి, ఇడా చైర్మన్ శివప్రసాద్, నగర అధ్యక్షులు చోడే వెంకటరత్నం, దాసరి ఆంజనేయులు పాల్గొన్నారు.

అధ్యాపకుడు వెంకటేశ్వర రెడ్డికి డాక్టరేట్ ప్రదానం

ఉంగుటూరు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని నారాయణపురం శ్రీఅరవింద శతజయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాల భౌతిక శాస్త్ర అధ్యాపకులు వెంకటేశ్వర రెడ్డి డాక్టరేట్‌ను అందుకున్నారు. హైదరాబాదులోని కేంద్రీయ విశ్వ విద్యాలయం నుంచి స్కూల్ ఆఫ్ ఫిజిక్స్ నుంచి డాక్టరేట్‌ను అందుకున్నారు. ప్రిన్సిపాల్ ఎస్.వెంకటేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ డి.రెడ్డియ్య, అకడమిక్ కోఆర్డినేటర్ డా.కొండా రవి అభినందనలు తెలియజేశారు. విద్యుత్ ప్రసారంలో ఎటువంటి నిరోధం లేకుండా ఈ సూపర్ కండక్టర్‌ను తయారు చేయడానికి ఈ పరిశోధన చేశారు.

హైస్కూల్ ప్లస్‌లలో లెక్చరర్ల నియామకాలకు వినతి

ఏలూరు అర్బన్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): స్థానిక రామకోటి సమీపంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల(హైస్కూల్ ప్లస్)లో ఇంటర్ విద్య బోధనకు జువాలజీ, పెదవేగి జడ్పీ హైస్కూల్ ప్లస్‌లో కామర్స్ లెక్చరర్లను నియమించాలని అభ్యర్థిస్తూ శనివారం పీడీఎస్‌వో జిల్లా శాఖ నాయకులు ఎల్.భాను నేతృత్వంలో విద్యార్థులు డీఈవో వెంకట లక్ష్మమ్మను కలుసుకుని వినతి పత్రాన్ని అందజేశారు. రెండేళ్ల క్రితమే ప్రారంభించిన ఈ హైస్కూల్ ప్లస్‌లలో ఇంటర్మీడియట్ సబ్జెక్టులను బోధించేందుకు లెక్చరర్లు లేకపోవడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. తరగతి గదులను కూడా కేటాయించాలన్నారు. డీఈవోను కలిసిన వారిలో సంఘ నాయకులు అఖిల్, హేమ, నిఖిల్ ఉన్నారు.

పింఛన్ల తొలగింపుపై ఆందోళన వద్దు

పెదవేగి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ పింఛన్లు అందుతాయని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. పింఛన్లు తొలగిస్తున్నారని ఎవ్వరూ ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు. దుగ్గిరాల క్యాంపు కార్యాలయంలో పలువురు పింఛను లబ్ధిదారులు తమ పింఛన్లు తొలగిస్తామని చెబుతున్నారని, తమకు న్యాయం చేయాలని ఎమ్మెల్యేకు విన్నవించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హత కలిగిన ఎవ్వరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని భరోసా ఇచ్చారు. అర్హులను గుర్తించి పింఛన్లు అందించే ప్రక్రియను కూటమి ప్రభుత్వం చేపట్టిందన్నారు. అలాగే అర్హులైన పేదలకు సొంతింటి కలను సాకారం చేసే దిశగా ప్రభుత్వం కసరత్తు చేస్తోందని, త్వరలో సొంతింటి కలను నిజం చేస్తామని ప్రభాకర్ వివరించారు.

ఎరువుల షాపులపై కొనసాగుతున్న దాడులు

ఏలూరు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో విజిలెన్స్, రెవెన్యూ, వ్యవసాయ శాఖల అధికారులు సంయుక్తంగా చేస్తున్న ఎరువుల దుకాణాలపై దాడులు శనివారం కూడా కొనసాగాయి. వీరవాసరంలో మహాలక్ష్మి ట్రేడర్స్ లక్ష్మి పెస్టిసైడ్స్, ధనుష్కోటి ఫెర్టిలైజర్స్, పెదపాడు మండలం పెదపాడులో బ్లూ విన్ ఆక్వా, వట్లూరులో అగ్రి సీడ్స్, రామా ట్రేడర్స్‌లో తనిఖీ చేశారు. ఇందులో మహాలక్ష్మి ట్రేడర్స్‌లో 86 వేల157 విలువ కలిగిన 5.225 టన్నుల ఎరువుల వ్యత్యాసం గుర్తించి వాటిని సీజ్ చేసి చేశారు. యజమానిపై 1955 ప్రకారం 6(ఏ) కేసును నమోదు చేశామని విజిలెన్స్ డీఎస్పీ సింగలూరి వెంకటేశ్వరరావు తెలిపారు.

నాలుగు సొసైటీలకు త్రిసభ్య కమిటీలు

ఏలూరు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నాలుగు సొసైటీలకు త్రిసభ్య కమిటీలను సహకార శాఖ ఉన్నతాధికారులు శనివారం రాత్రి ప్రకటించారు. గవరవరం సొసైటీకి చైర్మన్‌గా దుగ్గిరాల సుభాష్ చంద్రబోస్ సభ్యులుగా గంగాభవాని, రాచూరు సీతారామయ్య, కొత్తపట్టిసీమ సొసైటీకి చైర్మన్‌గా పూడి వెంకటరావు, సభ్యులుగా గణపతి నాగేశ్వరరావు, నాగ గణపతి కృష్ణారావు, మక్కినవారిగూడెం సొసైటీకి చైర్మన్‌గా ఆచంట సూర్యనారాయణ, సభ్యులుగా నరెడ్ల సత్యనారాయణ, దాసరి వెంకటలక్ష్మి, టినర్సాపురం సొసైటీకి చైర్మన్‌గా జోనుబోయిన సోంబాబు, సభ్యులుగా వెంకట రామారావు, ఉయ్యూరు నాగమయిలు నియమితులయ్యారు.

ధర్మకర్తలు ఆలయాభివృద్ధికి కృషి చేయాలి

ఏలూరు కార్పొరేషన్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): దేవాలయాల ధర్మకర్తలు ఆలయాల అభివృద్ధికి కృషి చేయాలని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. శనివారం పత్తేబాదలోని కనకదుర్గమ్మ ఆలయం వద్ద ధర్మకర్తలతో ప్రమాణ స్వీకారం చేశారు. శ్రీకనకదుర్గమ్మ ఆలయానికి చైర్మన్‌గా పృధ్వీ సత్యనారాయణమూర్తి, ధర్మకర్తలు పోలినాటి సత్తి రెడ్డి, కపిలవాయి రాజేశ్వరకుమార్, బొమ్మన హేమలత, కంచేటి దుర్గ, బోడెం ఉమామహేశ్వరి, అడ్డాల వెంకటేశ్వరరావు, పొన్నాడ వెన్నెల, ఎక్స్ అఫీషియోమెంబర్ ప్రయాగ వెంకట రామ్మూర్తిలతో ఎమ్మెల్యే ప్రమాణం చేయించారు. శ్రీచౌడేశ్వరి రామలింగేశ్వరస్వామి ఆలయానికి చైర్మన్‌గా మరకా శివయ్య, ధర్మకర్తలు అభిమళ్ల శ్రీనివాసరావు, కాకర్ల వెంకటదుర్గ, తాళ్ల గంగ, రామేశ్వరపు సౌజన్య, నిడమర్తి శ్రీలక్ష్మి సూర్యకుమారి, గారపాటి ఫణికుమార్, శీలా దుర్గా ప్రసాద్, మారుబారిక శ్రీనివాసరావులతో ఎమ్మెల్యే ప్రమాణస్వీకారం జరిపించారు. కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెంలో పర్యటించిన జిల్లా న్యాయమూర్తి

జంగారెడ్డిగూడెం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా కోర్టు న్యాయమూర్తి వై.శ్రీనివాసరావు శనివారం జంగారెడ్డిగూడెంలో పర్యటించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.ఎస్.ఎన్.మూర్తి పూల మొక్కతో కార్యాలయానికి ఆహ్వానించారు. అనంతరం గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీవెంకటేశ్వర స్వామిని దర్శించుకునేందుకు రాగా సిబ్బంది ఘన స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం ఈవో కలగర శ్రీనివాస్ సత్కరించారు. ఆయన వెంట స్థానిక కోర్టు న్యాయమూర్తి సి.హెచ్.కిశోర్ కుమార్ పాల్గొన్నారు.

ప్రజల సౌకర్యార్థం నూతన బస్సుసర్వీసు ప్రారంభం

ద్వారకాతిరుమల, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి):విద్యార్థులు, వ్యాపారుల సౌకర్యార్థం జంగారెడ్డిగూడెం నుంచి జి.కొత్తపల్లి మీదుగా నిడదవోలుకు నూతన బస్సు సర్వీసును శనివారం జి.కొత్తపల్లిలో సొసైటీ చైర్మన్ రేగంటి రాంబాబు జెండా ఊపి ప్రారంభించారు. నిడదవోలు డిపో బస్సుకు ఆయన జి.కొత్తపల్లిలో స్వాగతం పలికి గ్రామస్థులతో కలిసి ప్రారంభించారు. ఈ బస్సు ప్రతి రోజూ రెండు ట్రిప్పుల చొప్పున జంగారెడ్డిగూడెం నుంచి దేవులపల్లి, లక్కవరం, జి.కొత్తపల్లి, దూబచర్ల, నల్లజర్ల, యర్నగూడెం, త్యాజంపూడి మీదుగా నిడదవోలుకు వెళ్తుందని ఆర్టీసీ సిబ్బంది తెలిపారు. గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు చొరవతో ప్రారంభమైన ఈ బస్సు వల్ల ఎందరికో ఉపయోగం ఉంటుందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కస్సే శ్రీహరి, జొన్నకూటి అంకాలయ్య, కస్సే చక్రధరరావు, కూటమినేతలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

కళాశాల విద్యార్థులకు యూనిఫాం పంపిణీ

పెదపాడు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు దాత గాదం శ్రీరామ్మోహన్ ఆర్థికసహకారంతో సమకూర్చిన రెండు జతల యూనిఫాంను జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి శేఖర్‌బాబు శనివారం పంపిణీ చేశారు. శేఖర్‌బాబు మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలలో చదువుతున్న మీరంతా కష్టపడి చదివి కార్పొరేట్ కళాశాలలకు దీటుగా మంచి ఉత్తమ ఫలితాలను సాధించాలని, అలాగే దాతలు అందిస్తున్న సహకారాన్ని వినియోగించుకోవాలన్నారు. యూనిఫాం అందజేసిన దాతను ఈ సందర్భంగా అభినందించారు. కార్యక్రమంలో రీజనల్ ఇన్‌స్పెక్టింగ్ అధికారి యోహాన్, కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ఉద్యోగ విరమణ సత్కారం

ఏలూరు రూరల్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ఎందరో విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దే గురువులు దైవంతో సమానులని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. మండలంలో శ్రీరాంనగర్ ఎంపీ యూపీ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు బేతాళ సుదర్శనం పదవీ విమరణ సత్కార కార్యక్రమం శనివారం ఆ పాఠశాల ప్రాంగణంలో ఘనంగా జరిగింది. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని విధినిర్వహణలో అంకిత భావంతో పనిచేసిన బేతాళ సుదర్శనంను అభినందించారు. ఈడా చైర్మన్ పెద్దబోయిన శివప్రసాద్, అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ చైర్మన్ మామిళ్ళపల్లి పార్థసారథి, దాసరి ఆంజనేయులు, చోడే వెంకటరత్నం పాల్గొన్నారు.

ఎదగాలి..ఒదగాలి!

(5వ పేజీ తరువాయి)

చేయాలని భావించి ఏళ్ల తరబడి కష్టపడినా గారపాటి సీతారామాంజనేయ చౌదరి వంటి నేతలు వెనుకబడి పోవాల్సి వచ్చింది. పార్టీ పదవుల్లోనూ సీనియర్లకు మొఖం చాటేసి తాము ఎంపిక చేసిన వారికే ప్రాధాన్యం లభిస్తూ వచ్చింది. అయితే ఈ మధ్యనే కొంచెం మార్పు కనిపిస్తోంది.

జిల్లాకే ప్రాధాన్యం: సాధారణంగా పార్టీ కార్యక్రమాల నిర్వహణ, చురుకుదనం, కేడర్‌లో ఊపు తెచ్చే నేతలకే బీజేపీలో అత్యంత ప్రాధాన్యత ఉండేది. చాన్నాళ్ల తర్వాత రాష్ట్ర కమిటీలో జిల్లాకు చెందిన ఇద్దరు నేతలకు ఉపాధ్యక్ష హోదా కల్పించి, ఆ మేర కేడర్‌లో కొంతలో కొంత ఉత్సాహం నింపగలిగారు. రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ ఈ మేరకు ముందు చూపు ప్రదర్శించారు. జిల్లాలో బీజేపీ ఎమ్మెల్యే, సీనియర్ నేత కామినేని శ్రీనివాస్ కొనసాగుతుండగానే ఇదే జిల్లాలో పార్టీ కార్యవర్గంలో ఇద్దరి నేతలకు ఒకేస్థాయి కలిగిన పదవులు ఇవ్వడం తాజా పరిణామంగానే పార్టీ నేతలు భావిస్తున్నారు. ఉత్తరాంధ్ర ఇన్‌చార్జిగా ఉన్న గారపాటి సీతారామాంజనేయ చౌదరి (తపన చౌదరి)ని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నుంచి పదోన్నతి కల్పించారు. గత ఎన్నికల హయాంలో బీజేపీ అగ్రనేత రాజ్‌నాథ్‌సింగ్ జిల్లాలో పర్యటిం చేందుకు వీలుగా సన్నాహాలు చేసిన వారిలో తపన చౌదరి ఒకరు. ఈ ప్రాంతానికి సంబంధించి ఏలూరునే టార్గెట్‌గా చేసుకుని పార్టీ అగ్రనేతలు వచ్చినా, పలు కమిటీలకు చెందిన నేతలు వచ్చినా ఈ ప్రాంతాన్నే సిఫారసు చేసేవారు. ఇప్పుడు ఎలాగూ జిల్లా నాయకత్వంను చౌటపల్లి విక్రమ్ కిశోర్ సాధ్యమైనంత మేర ముందుకు నడిపేందుకు ప్రయత్నిస్తున్నారు. ఆయనతో పాటు పార్టీలో ఉన్న కృష్ణప్రసాద్, సుధాకర్ కృష్ణ వంటివారు పార్టీ కార్యక్రమాల్లో ఇప్పటికి చురుగ్గానే ఉన్నారు.

మమ్మల్ని ఆదుకోండయ్యా..

నూతన పింఛన్ల కోసం వితంతువుల ఎదురు చూపు

ఏలూరు రూరల్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి):గ్రామాల్లో పలువురు వితంతువులు నూతన పింఛన్లు కోసం ఎదురుచూస్తున్నారు.గత 8నెలల్లో భర్తను కోల్పోయిన వారు సచివాలయాల చుట్టూ తిరుగుతున్నారు. అయితే ఆన్‌లైన్ వెబ్‌సైట్ ఓపెన్ కావడం లేదని వెల్ఫేర్ అసిస్టెంట్లు చెప్పడంతో తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం స్పౌజ్ కోటా కింద ఇస్తున్న విధంగా తమకూ పింఛన్లు మంజూరు చేయాలని వారు వేడుకుంటున్నారు. వాస్తవంగా మండలంలో వివిధ రకాలైన మొత్తం 5,320 పింఛన్లు అందుతున్నాయి. పింఛన్లు పంపిణీ కోసం ప్రభుత్వం ప్రతీ ఏటా సుమారు రూ.2.32 కోట్లు మంజూరు చేస్తోంది. కాగా ఎన్టీయార్ భరోసా కింద పింఛన్ మంజూరు చేయాలని వితంతువుల సచివాలయాలకు వస్తే ఆన్లైన్ సైట్ పూర్తిగా క్లోజ్ అయ్యిందని అక్కడున్న సిబ్బంది చెబుతున్నారు. దీంతో వారు చేసేదిలేక వెనుతిరగాల్సి వస్తోంది. పింఛన్ పొందుతున్న భర్త చనిపోతే ఆ స్థానంలో భార్యకు(స్పౌజ్) పింఛన్ మంజూరు చేస్తున్నారు. కానీ వితంతువులకు మాత్రం పింఛన్ మంజూరుకు దరఖాస్తు చేసుకునే అవకాశం లేకుండా పోయింది. దీంతో సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏలూరు రూరల్ మండలంలో చాలా



మంది వితంతువులకు పింఛన్లు రాలేదు. ఇలా చెప్పుకుంటూపోతే అనేక మంది అర్హులైన వితంతువులు ఉన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమను ఆదు కోవాలని వారు కోరుతున్నారు. వితంతు పింఛన్లు మం జూరు విషయంలో ప్రభుత్వ ఆదేశాల కోసం ఎదురుచూస్తున్నారు. ఉత్తర్వులు వస్తే వెంటనే చర్యలు తీసుకుంటామని మరోవైపు ఏలూరు ఎంపీడీవో వెన్న శ్రీలత పేర్కొంటున్నారు.

ముద్దాయిలకు శిక్ష పడేలా విధులు నిర్వర్తించాలి : ఏఎస్పీ

ఏలూరు క్రైం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): నేరం నిరూపణ అయితే శిక్షపడేలా సమర్థవంతంగా కోర్టు మానిటరింగ్ సెల్ సభ్యులు విధులను నిర్వర్తించాలని ఏఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు అన్నారు. జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ ఆదేశాల మేరకు ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం జిల్లాలోని కోర్టు మానిటరింగ్ సెల్ సభ్యులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించగా ఏఎస్పీ పాల్గొన్నారు. నేరస్థులు శిక్ష తప్పించుకోకూడదని బాధితులకు న్యాయం అందేలా విధులను నిర్వర్తించాలన్నారు. ప్రతి రోజు కోర్టులో జరిగిన ప్రక్రియను డాక్యుమెంట్ చేసి స్టేషన్ అధికారికి నివేదించాలన్నారు. ఉత్తమ సేవలు అందించిన మహిళా హెడ్‌కానిస్టేబుల్ ఎం.వి.రమణ, హెడ్‌కానిస్టేబుల్ కె.ఎస్.ఎన్.మూర్తికి ప్రోత్సాహ బహుమతులు



మహిళా హెడ్‌కానిస్టేబుల్ రమణకు బహుమతిని అందిస్తున్న ఏఎస్పీ

అదనపు ఏఎస్పీ చేతుల మీదుగా అందించారు. ఈ సమావేశంలో కోర్టు మానిటరింగ్ సెల్ ఇన్‌స్పెక్టర్ ఎం.సుబ్బారావు, జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లలో ఉన్న కోర్టు మానిటరింగ్ సెల్ సభ్యులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.



ఏలూరు కుండీ సెంటర్‌లో గణపతి



జీలుగుమిల్లిలో స్వామి అలంకరణ



పెదపాడులో ఊరేగింపు



తాళ్లమూడిలో స్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే చింతమనేని

ఘనంగా చవితి వేడుకలు

ఏలూరుకార్పొరేషన్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు డివిజన్లలో జరుగుతున్న గణేష్ నవరాత్రుల్లో శనివారం నాల్గవ రోజు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పవర్ పేటలోని శ్రీ విజయ గణపతి ఆలయం వద్ద జరుగుతున్న విజయ గణపతి ఉత్సవాల్లో భాగంగా స్వామికి శ్రీలక్ష్మీ గణపతి అలంకారం జరిపి హోమాన్ని జరిపారు. సత్రంపాడులోని శ్రీలక్ష్మీ గణపతి ఆలయం వద్ద మోదుకార్చకన జరిపి సిద్ధిబుద్ధి సమేత శ్రీలక్ష్మీగణపతి కళ్యాణాన్ని నిర్వహించారు. రామకోటిలోని గణేష్ ఉత్సవాలలో స్వామికి గులాబీపూలతో అర్చనలు జరిపారు.

● పెదవేగి: ప్రజలంతా ఆనందంగా ఉండడమే పండుగ అని లక్ష్మీపురం సర్పంచ్ మేకా కనకరాజు అన్నారు. లక్ష్మీపురంలో జరుగుతున్న వినాయక చవితి వేడుకల్లో భాగంగా మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన మహిళలకు బహుమతులు అందించారు.

● పెదపాడు: అప్పనవీడు, తాళ్ళమూడి ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన విఘ్నేశ్వర మండపాల్లో వినాయకులను దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ శనివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయా ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొని అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. అభయాంజనేయ స్వామి చైర్మన్ వేమూరి శ్రీనివాసరావు, బెక్కం లక్ష్మీనారాయణ, మట్టా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

● జీలుగుమిల్లి: బాలగణేశ్ యూత్ ఆధ్వర్యంలో గణనాథుడికి చవితి వేడుకల్లో భాగంగా ప్రత్యేక పూజలు జరుపుతున్నారు. జీలుగుమిల్లిలో ఆర్యవైశ్య, బీసీ, ఎస్సీ సంఘాల వారు పలు చోట్ల వినాయకుడి మండలపాల్లో విగ్రహాలు ఏర్పాటు చేసి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహిస్తున్నారు. శనివారం గౌడ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్ర హం వద్ద అన్నసమారాధనలు నిర్వహించారు. ఆదివారం బాలగణేశ్ యూత్, ఆర్యవైశ్య సంఘాల ఆధ్వర్యంలో అన్న సమారాధనలు జరుపుతామన్నారు.

● బుట్టాయగూడెం: ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని వినాయకుడికి ప్రత్యేక పూజలు చేసినట్టు ఏపీ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు తెలిపారు. శనివారం కంట్రికగూడెంలో ఏర్పాటు చేసిన గణపతి విగ్రహాన్ని దర్శించుకున్నారు. చైర్మన్ వెంట నియోజకవర్గ పరిశీలకుడు ఆనపర్తి వెంకటనారాయణ, మండల పార్టీ అధ్యక్షుడు మొగపర్తి సోంబాబు, దెయ్యాల కృష్ణమోహన్, కృష్ణ ఉన్నారు.

● దెందులూరు : మండలంలోని దోసపాడు గ్రామంలో శ్రీకృష్ణ వినాయక కమిటీ ఆధ్వర్యంలో చవితి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. శనివారం ఉదయం కమిటీ సభ్యులు జయన రాంబాబు, కొలుసు శివశ్రీ, నెరుసు రాటయ్య, ప్రశాంత్ సూరిబాబుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీడీపీ నాయకులు మేకా నాగయ్య, మాజీ సర్పంచ్ నెరుసు గంగరాజు, గోదావరి కాల్వ డీసీ వైస్ చైర్మన్ అత్తూలూరి చంద్రశేఖర్, సర్పంచ్ గోరింక యేసు మణి, ఏసోబు, మాజీ నీటి సంఘం అధ్యక్షుడు అత్తూలూరి శ్రీనివాసరావు, దాకరాపు ప్రసాద్, మోదూరి వెంకటేశ్వరరావులు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భారీ అన్నదానం నిర్వహించారు.

నేరాల నియంత్రణకు ప్రతి ఒక్కరూ సహకరించాలి



న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహిస్తున్న దృశ్యం

లింగపాలెం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ప్రజలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని మారుమూల గ్రామాల ప్రజలకు సైతం న్యాయసేవలను అందిచేందుకు ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించేందుకు చట్టాలపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు జూనియర్ సివిల్ జడ్జి సి.హెచ్.మధుబాబు తెలిపారు. మండలంలోని కలరాయనగూడెంలో శనివారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మదుబాబు మాట్లాడుతూ చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, తద్వారా నేరాలను నియంత్రించడంతో పాటు సమాజంలో ఆదర్శవంతమైన జీవన విధానానికి దోహదపడుతుందన్నారు. న్యాయం ప్రతి ఒక్కరికీ హక్కు అని చట్టాలపై అవగాహన కలిగి ఉండటం ప్రతి ఒక్కరికి అవసరమన్నారు. ఉచితంగా న్యాయ సేవలందుకోవడానికి న్యాయసేవా సంస్థలను సంప్రదిస్తే ఉచితంగా న్యాయ సహాయం అందుతుందన్నారు. కుటుంబ తగాదాలు, రైతుల సాగు చట్టాలు, పోక్సో చట్టాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యులు, మండల తహసీల్దార్ నజీ ముల్లాషా, ధర్మాజీగూడెం ఎస్ఐ కె.వెంకన్న, లీగల్ సెల్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

కిశోర బాలికలకు అవగాహన

పెదవేగి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): కౌమార దశలో బాలికలు ప్రలోభాలకు లోనైతే వారి జీవితం నరకమవుతుందని కొప్పాక జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఆర్.శైలజ అన్నారు. కిశోరీ వికాసంలో భాగంగా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కొప్పాక ఉన్నత పాఠశాలలో శనివారం బాలికలకు మంచీ, చెడులపై అవగాహన కల్పించారు. హెచ్‌ఎం శైలజ మాట్లాడుతూ మంచీ, చెడులపై బాలికలు అవగాహన అవసరమన్నారు.కొప్పాక సెక్టారు సూపర్‌వైజర్ కె.శాంతారత్నం, మహిళా సంరక్షణ కార్యదర్శి బి.కుసుమ సాయిశ్రీ పాల్గొన్నారు. లక్ష్మీపురం పాఠశాలలో జరిగిన కిశోరీ వికాసంలో పెదవేగి సెక్టారు సూపర్‌వైజర్ సీహెచ్.పార్వతి, మహిళా సంరక్షణ కార్యదర్శి ఎం.జ్యోతి పాల్గొన్నారు.

ఐసీఎంఆర్ వర్కుషాపులో సీఆర్ఆర్ ఫార్మసీ విద్యార్థినుల ప్రతిభ

ఏలూరు అర్బన్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఫార్మసీ విద్యార్థులకు ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చి(ఐసీఎంఆర్) ఆధ్వర్యంలో శనివారం గుంటూరులోని విజ్ఞాన్ ఫార్మసీ కళాశాలలో ఇన్నోవేటివ్ పారాడిగ్మ్స్ ఇన్ ప్రీ క్లినికల్ రీసెర్చ్ అనే అంశంపై జరిగిన అంతర్జాతీయ వర్కుషాపు సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో ఏలూరు సీఆర్ఆర్ ఫార్మసీ కళాశాల విద్యార్థినులు అగ్రస్థానంలో నిలిచి బహుమతులు సాధించారని కరస్పాండెంట్ చలసాని విశ్వనాథరావు(నానాజీ) తెలిపారు. అడ్వాన్స్ బయో స్టాటిస్టిక్స్, ఎపిడిమాలజీ, డేటా మెథడాలజీస్ విభాగాల్లో అత్యుత్తమ ప్రదర్శనతో గుర్తింపు పొందారని వివరించారు. ఈ పోటీల్లో మొత్తం 210 మంది పోటీ పడగా, తమ కళాశాల ఫార్మ్ డి 5వ సంవత్సరం విద్యార్థినులు ఆర్.జ్యోతి,సి.కళ్యాణి, ఎం.శ్రీనేహలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు లభించాయన్నారు. మొత్తం



విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

నాలుగు విభాగాల్లో వీరంతా విజేతలుగా నిలవడం హర్షణీయమన్నారు. వీరితో పాటు నాయకత్వ నైపుణ్యాల ప్రదర్శనలో ఎ.శాంతిప్రియ, ఇ-పోస్టర్ పెయింటింగ్ పోటీలో ఎ.భవ్యశ్రీ, కె.శైలజ విజేతలుగా నిలిచారని తెలిపారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థినులను కరస్పాండెంట్‌తో పాటు, ప్రిన్సిపాల్ డాక్టర్ నరేంద్రబాబు అభినందించారు.

జేడీ కార్యాలయంలో విచారణ

ఏలూరు టూటౌన్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ గోవిందరాజులుపై వచ్చిన ఆరోపణలపై విచారణ నిర్వహించారు. పశు సంవర్ధక శాఖ ఉద్యోగ సంఘాల జేఏసీ చేసిన ఫిర్యాదులపై ఎన్టీఆర్ జిల్లా జాయింట్ డైరెక్టర్ డాక్టర్ హనుమంతరావు శనివారం జేడీ కార్యాలయంలో విచారణ నిర్వహించారు. నిధులు దుర్వినియోగం, సిబ్బందిని ఇబ్బందిపెట్టడం లాంటి ఆరోపణలపై హనుమంతరావు విచారణ నిర్వహించారు. ఫిర్యాదు చేసిన సిబ్బందిని, జేడీ నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం జేడీ హనుమంతరావు మాట్లాడుతూ విచారణ నివేదికను అధికారులకు సమర్పిస్తామన్నారు. ముందుగా విచారణ అధికారి ఎదుట సిబ్బంది తమకు న్యాయం చేయాలంటూ ఆందోళన నిర్వహించారు.

చిన్నపరిశ్రమల స్థాపనకు సహకారం

ఏలూరుటూటౌన్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వం ఎన్నోరాయితీలు ఇస్తోందని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో ఎంఎస్ఎంఈ పై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ పరిశ్రమలు స్థాపించుకునేవారికి పన్ను మినహాయింపులు ఇస్తామన్నారు. మెప్మా సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది, పరిశ్రమలు స్థాపించాలనుకునే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, పరిశ్రమల శాఖ జీఎం సుబ్రహ్మణ్యేశ్వరరావు, నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ శివారెడ్డి, మెప్మా జిల్లా కోఆర్డినేటర్ మహాలక్ష్మి, నోడల్ ఆఫీసర్ జితేంద్రబాబు, పాల్గొన్నారు.

రైతులు నానో ఎరువులు వాడాలి

లింగపాలెం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ప్రతి రైతు తమ పంటలకు సులభంగా ఉపయోగించే నానో ఎరువులను వాడాలని మండల వ్యవసాయాధికారి వి.ప్రదీప్ కుమార్ అన్నారు. మండలంలోని యడవల్లి39 గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు తమ పంటలలో తెగుళ్ల నివారణ గురించి సలహాలు, సూచనలను తెలియజేశారు. ఏఈవో గణేశ్, వ్యవసాయ శాఖ సిబ్బంది, పలువురు రైతులు పాల్గొన్నారు.

పేదలకు మరింత సేవలు

ఏలూరు రూరల్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ఏలూరు విజన్ లైన్స్ క్లబ్ ద్వారా పేదలకు మరిన్ని సేవలందిస్తామని క్లబ్ జోన్ చైర్ పర్సన్ ఎ.సర్వేశ్వరరావు అన్నారు. శనివారం హనుమాన్ నగర్‌లో క్లబ్బు మొదటి జోన్ అడ్వైజరీ సమావేశం జరిగింది. సమావేశంలో సేవా కార్యక్రమాలు, భవిష్యత్‌లో చేయబోయే కార్యక్రమాలపై చర్చించారు. ఎల్ వెంకటేశ్వరరావు, లక్ష్మీనారాయణ, చుక్క అవినాష్, శేష్‌కుమార్, బివి రమణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

బంజారాలకు క్షమాపణలు చెప్పాలి

చింతలపూడి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి):తిరపతిలో హజారాం బాలాజీ మఠాన్ని కూల్చివేయాలని చేసిన వ్యాఖ్యలకు క్షమాపణలు చెప్పాలని ఎస్టీ బంజారా లంబాడీ సుగాలి సంక్షేమ సంఘం రాష్ట్ర, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగేశ్వరరావు, జి.కృష్ణ నాయక్, దారావత్ కిమ్యా, బి.రాజబాబు నాయక్ డిమాండ్ చేశారు. 126 ఏళ్ల చరిత్ర కలిగిన హతీరావు బాలాజీ మఠాన్ని కూల్చడమంటే 16కోట్ల మంది బంజారాల సంస్కృతి, సంప్రదాయాలను మనోభావాలను దెబ్బతీసే విధంగా ఉన్నాయన్నారు. ఈ వ్యాఖ్యలు వెనక్కి తీసుకోకుంటే తదుపరి పరిణామాలు తీవ్రంగా ఉంటాయన్నారు. అంతే కాక హిందూ ధర్మం కాపాడుకోవడానికి ప్రభుత్వం తమకు రక్షణ కల్పించాలన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు సాధించాలి

జీలుగుమిల్లి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి):గ్రామీణ ప్రాంత యువత ఉన్నతలక్ష్యాల సాధనకు కృషి చేయాలని ఎస్.ఐ. వి.క్రాంతికుమార్ అన్నారు. దర్భగూడెం ఎస్టీస్ ఫీటర్ అండ్ పాల్ పాఠశాల్లో విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. పోక్సో చట్టాలు, సైబర్ నేరాల వల్ల కలిగే నష్టాలు వివరించారు. సోషల్ మీడియా ప్రభావం వల్ల యువత నష్టపోకుండా జాగ్రత్త పడాలన్నారు. ఆన్‌లైన్ షాపింగ్ పేరుతో మోసాలకు గురికాకుండా ఉండాలన్నారు. విద్యార్థినుల పట్ల అసభ్య పదజాలంతో మాట్లాడినా, ఫోన్‌ల ద్వారా బెదిరించినా పోక్సో కేసు నమోదు చెయ్యాల్సి వస్తుందన్నారు. ప్రిన్సిపాల్ అమల కుమారి, సిస్టర్స్ ఉపాధ్యాయ, పోలీస్ సిబ్బంది ఏసురత్నం, సింధు, వంశీ ఉన్నారు.



పోలీస్ అధికారుల సన్మానంలో ఏఎస్పీ సూర్యచంద్రరావు

పోలీసు అధికారులకు సన్మానం

ఏలూరు క్రైం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): పోలీస్ శాఖలో ఉద్యోగం చేస్తూ ప్రజా జీవితానికి అంకితమై ఎన్నో సేవలు చేసి నేడు పదవి విరమణ పొందడం భగవంతుడు ఇచ్చిన వరమేనని జిల్లా అదనపు ఎస్పీ ఎన్ సూర్యచంద్రరావు అన్నారు. ఏలూరు జిల్లా పోలీస్ శాఖలో ఉద్యోగం చేస్తూ నేడు పదవి విరమణ చేసిన ఏలూరులో పనిచేస్తున్న ఎస్ఐ మీర్జాఆలీహుస్సేన్, నూజివీడు రూరల్ ఎఎస్ఐ ఎల్ చంద్రశేఖర్, చేబ్రోలు పోలీస్ స్టేషన్ ఎఎస్ఐ షేక్ రహిమాన్‌లు పదవి విరమణ పొందడంతో ఆ ముగ్గురిని ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ కెపిఎస్ కిషోర్ ఆదేశాల మేరకు అదనపు ఎస్పీ ఎన్ సూర్యచంద్రరావు ఘనంగా సత్కరించి వీడ్కోలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబ పరమైన అంశాలలో అధిక ప్రాధాన్యత ఇస్తూ ఆరోగ్యంగా ఉండాలని శాఖాపరమైన అంశాల్లో ఏవైనా సహాయ సహకారాలు అవసరమైతే అధికారులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఆర్ఆర్ఐ పవన్‌కుమార్, ఆర్ఎస్ఐ భాస్కరరావు, పోలీసు అధికారుల సంఘ అధ్యక్షుడు ఆర్ నాగేశ్వరరావు పలువురు పాల్గొన్నారు.

రేపు ఆక్వాజోన్ సమావేశం

దెందులూరు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ఆక్వాజోన్-నాన్ జోన్‌లపై తహసీల్దార్, వ్యవసాయ శాఖ, మత్స్యశాఖ అధికారుల బృందం ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండల స్థాయి సమావేశం ఈ నెల 1న సోమవారం నిర్వహిస్తామని మత్స్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రాజ్‌కుమార్, మండల మత్స్య శాఖ అధికారి ఎ.సతీశ్ తెలిపారు. ఆక్వాల్యాబ్ మత్స్యశాఖాధికారి ఎం.భవిత మాట్లాడుతూ ఏలూరులో నూతన హంగులతో సిద్ధం చేసిన ఆక్వాల్యాబ్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ ల్యాబ్‌లో అన్ని పరీక్షలు చేస్తారన్నారు.

పారిశుధ్యం పరిశీలన

దెందులూరు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): గోపన్నపాలెం పంచాయతీ పరిధిలో గ్రామస్థులంతా పారిశుధ్య పరిరక్షణకు గోపన్నపాలెం పంచాయతీ కార్యదర్శి పి.స్టానిష్ బాబు అన్నారు. శనివారం గోపన్నపాలెం పంచాయతీ పరిధిలో పారిశుధ్య పరిరక్షణ పనులను పరిశీలించారు. రోడ్డు పక్కన ఉన్న చెత్తను తరలించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్లాస్టిక్‌ను పంచాయతీ పరిధిలో వాడకుండా చర్యలు తీసుకున్నామన్నారు.

రెండు గ్రామాల్లో క్లోరినేషన్..

పెదపాడు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అప్పుడే వ్యాధులు ప్రజలకుండా ఉంటాయని పెదపాడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టరు చక్రధర్ తెలిపారు. పెదపాడు, వసంతాడ గ్రామాల్లో వైద్య సిబ్బందిచే క్లోరినేషన్, దోమల నివారణ మందు పిచికారీ చేయించారు. వైద్యసిబ్బంది పలిశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ధర్నాకు ఏపీటీఎఫ్ మద్దతు

ఏలూరు అర్బన్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): సీపీఎస్‌ను రద్దుచేసి పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఏపీసీపీఎస్ ఉద్యోగుల సంఘం సెప్టెంబరు 1న నిర్వహించతలపెట్టిన పెన్షన్ విద్రోహదినం ఆందోళనకు ఏపీటీఎఫ్-1938 సంపూర్ణ మద్దతు తెలియజేస్తోందని ఆ సంఘ నాయకులు జి.కృష్ణ, రామ్మోహన్, మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. చలో విజయవాడ ధర్నాకు జిల్లా నుంచి ఎక్కువ సంఖ్యలో ఉద్యోగ, ఉపాధ్యాయులు హాజరుకావాలని కోరారు.

కళాశాలలో వర్కుషాపు

ఏలూరు అర్బన్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): దైనందిన జీవితంలో విద్యుత్, ఎలక్ట్రానిక్స్ అనువర్తనాలు అనే అంశంపై శనివారం స్థానిక సెయింట్ థెరిస్సా మహిళా కళాశాలలో వర్కుషాపు జరిగింది.ఏసీ,డీసీ జనరేటర్లు, మోటార్లు ప్రదర్శించి వాటి సాంకేతికతను వివరించారు. సీనియర్ ఇంజనీర్ శ్రీనివాసరావు, కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ, అధ్యాపకులు శ్రీలత, దీప్తిభార్గవ, అనూష, మాధురి పాల్గొన్నారు.

పట్టిసీమ శ్రీసుదర్శన కల్యాణ వేంకటేశ్వరస్వామికి పూజలు

పోలవరం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): పట్టిసీమ శ్రీసుదర్శన కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. హైదరాబాదుకు చెందిన భక్తులు అన్నదానం ప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు.పోలవరం, తాళ్లపూడి, గోపాలపురం మండలాల నుంచి మహిళా భక్తులు అధిక సంఖ్యలో కాలినడకన వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. తొమ్మిది శనివారాల భక్తులు ప్రత్యేక పూజ లు నిర్వహించారు. సుమారు మూడువేల మందికి పైగా భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నట్టు ఆలయ నిర్వాహక కమిటీ మహిళలు తెలిపారు.

పింఛన్ల పంపిణీకి సర్వం సిద్ధం

దెందులూరు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి):ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను దెందులూరు మండలంలో సెప్టెంబరు 1న ఉదయం 7 గంటలకు ఇంటింటా పంపిణీ చేయడానికి సిద్ధం చేసినట్టు ఎంపీడీవో కంతేటి శ్రీదేవి తెలిపారు. 17 పంచాయతీల పరిధిలో 9వేల 364 పెన్షన్లు అందిస్తున్నట్టు తెలిపారు. వివిధ కారణాలతో ఆగిన దివ్యాంగుల పెన్షన్లు 259 మందికి సోమవారం అందించడం జరుగుతుందన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

చింతలపూడి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ బాలికల పాఠశాలలో టెన్త్ విద్యార్థినులకు జీవశాస్త్రం స్టడీమెటీరియల్‌ను పంపిణీ చేశారు. పాఠశాల ఉపాధ్యాయిని కే.సుజాత సొంతఖర్చులతో ఈ మెటీరియల్ తయారు చేయడం జరిగిందన్నారు. సుజాతకు హెచ్‌ఎం ఎం.చక్రధరరావు అభినందనలు తెలిపారు.

2న మండల సమావేశం

బుట్టాయగూడెం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం సెప్టెంబరు 2న ఎంపీపీ కారం శాంతి అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో కె.జ్యోతి తెలిపారు. సమావేశంలో శాఖల పురోగతిపై ప్రజాప్రతినిధులు సమీక్ష చేస్తారని అన్ని శాఖల అధికారులు అధికారులు ప్రగతి నివేదికలతో తప్పకుండా హాజరు కావాలన్నారు.ముందస్తు సమాచారం లేకుండా సమావేశానికి గైర్హాజరైన అధికారుల పేర్లను తగు చర్యల కోసం జిల్లా కలెక్టర్ వారికి పంపుతామన్నారు.

ధర్మకర్తల మండలి ప్రమాణస్వీకారం

ఏలూరుటూటౌన్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): పత్తేబాదలో ఉన్న శ్రీకనకదుర్గమ్మ దేవస్థానం, శ్రీచౌడేశ్వరి రామలింగస్వామి దేవస్థానాల ధర్మకర్తల మండలి ప్రమాణస్వీకారం చేసింది. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బడేటి చంటి పాల్గొన్నారు. రెడ్డినాగరాజు, నాయుడు సోము, శరద, పృధ్వీ నారాయణమూర్తి, శివయ్య, పాల్గొన్నారు.



ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే చంటి

వేల్పుచర్లలో ముమ్మరంగా దోమల నివారణ చర్యలు

ముసునూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): వేల్పుచర్లలో డెంగీ కేసులు నమోదు కావడంతో దోమల నివారణకు అధికారులు ముమ్మర చర్యలు చేపట్టారు. శనివారం పంచాయతీ, వైద్య ఆరోగ్య సిబ్బంది అన్ని కాలనీల్లో ఫాగింగ్ చేసి, మురుగునీరు నిల్వ ప్రదేశాల్లో మలాథియాన్ మందును పిచికారి చేసి, బ్లీచింగ్ చల్లారు. పనులను ఎంపీడీవో, కార్యదర్శి పర్యవేక్షించారు. ముసునూరు పీహెచ్‌సీ వైద్యాధికారిణి ప్రజలకు వైద్యపరీక్షలు నిర్వహించారు. డెంగీ జ్వర పీడితులు నలుగురి ఆరోగ్య పరిస్థితి బాగానే ఉందని ఆమె తెలిపారు.

సురక్షిత నీటినే సరఫరా చేయండి: ఎంపీడీవో

కలిదిండి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సురక్షిత కుళాయి నీటిని సరఫరా చేయాలని ఎంపీడీవో ఫణీంద్ర పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. శనివారం తాడినాడలో సీపీడబ్ల్యూఎస్ పథకాన్ని పరిశీలించి మాట్లాడుతూ తాగునీటి చెరువులో క్లోరినేషన్ చేయాలన్నారు. పైపులైన్ల లీకేజీలను అరికట్టాలన్నారు. నీటి పరీక్షలు నిర్వహించాలన్నారు. అనంతరం సచివాలయంలో రికార్డులను పరిశీలించి ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు.

13న జాతీయ లోక్ అదాలత్

15వ అదనపు జిల్లా జడ్జి నాగశైలజ



నూజివీడు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సెప్టెంబరు 13న జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు మండల న్యాయసేవా అధికార సంస్థ చైర్మన్, 15వ అదనపు జిల్లా జడ్జి ఎ.నాగశైలజ తెలిపారు. రాజీమార్గం ద్వారా కేసుల పరిష్కారానికి సుముఖంగా ఉన్న కక్షిదారులు తమ న్యాయవాది ద్వారా ఇరు పార్టీలు హాజరై రాజీ కుదుర్చుకుని కేసులను బయటపడవచ్చన్నారు. లోక్ అదాలత్‌లో రాజీకి వీలున్న క్రిమినల్ కేసులు, బ్యాంకు రికవరీ కేసులు, ఎక్సైజ్, చెక్‌బౌన్స్ తదితర కేసులను పరిష్కరించుకోవచ్చన్నారు.

ఎరువులు అధిక రేట్లకు విక్రయిస్తే లైసెన్సు రద్దు

జిల్లా వ్యవసాయాధికారి షేక్ హబీబ్ బాషా



నూజివీడు టౌన్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): నూజివీడు పట్టణ, మండల ప్రాంతాల్లో ఎరువుల దుకాణాలను జిల్లా వ్యవసాయాధికారి షేక్ హబీబ్ బాషా శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని సరిపడా యూరియా నిల్వలను అందుబాటులో ఉంచామన్నారు. ఎవరైనా ఎరువుల కృత్రిమ కొరత సృష్టించి అధిక రేట్లకు విక్రయిస్తే షాపుల లైసెన్సులను రద్దు చేస్తామన్నారు. అదే విధంగా స్టాక్, బిల్ బుక్స్ సక్రమంగా నిర్వహించాలన్నారు. రబీలో మొక్కజొన్న సాగుచేసే రైతులు ముందుగానే యూరియా తీసుకుని నిల్వ ఉంచుకుంటున్నారని, అలా చేయవద్దని సూచించారు. మండలంలో పీఏసీఎస్‌లు, ప్రైవేట్ డీలర్ల వద్ద 21 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు జి.విద్యాసాగర్, మండల వ్యవసాయశాఖ అధికారి పలగాని చెన్నారావు తదితరులు పాల్గొన్నారు.

'పీ-4'తో పేదల ఇంట వెలుగు



ట్రై సైకిల్, చెక్కులు పంపిణీ చేస్తున్న మండవ ఫౌండేషన్ ప్రతినిధులు

ఆగిరిపల్లి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): పేదల సాధికారతే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీ4 కార్యక్రమంలో ప్రతినిధులు బంగారు కుటుంబం లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో షేక్ రజియాబీకి రూ.11,000 విలువ గల ట్రైసైకిల్, చదువు నిమిత్తం గొల్లపల్లి ప్రదీప్‌కు రూ.25,000, షేక్ జైనబి కిరాణా షాపు అభివృద్ధి కోసం రూ.45,000, గోనె సంచుల మరమ్మతుల కోసం చాపల మహాలక్ష్మీకి రూ.20,000 చెక్కును పంపిణీ చేశారు. మండవ ఫౌండేషన్ ప్రతినిధులు బి. సుబ్బారావు, ఎం. వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఎరువులు



చిగురుకోట పీఏసీఎస్‌లో ఎరువుల వ్యాపారాన్ని ప్రారంభించిన అధ్యక్షుడు చలసాని జగన్మోహనరావు

ముదినేపల్లి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ద్వారా రైతులకు ఎరువులను అందుబాటులోకి తెచ్చేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి, చిగురుకోట పీఏసీఎస్ అధ్యక్షుడు చలసాని జగన్మోహనరావు అన్నారు. శనివారం పీఏసీఎస్‌లో నూతనంగా మంజూరైన లైసెన్స్‌తో ఎరువుల వ్యాపారాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడుతూ గ్రామాల్లోనే రైతులకు నాణ్యమైన ఎరువులు అందించాలన్నదే ప్రభుత్వ ధ్యేయమన్నారు. రైతులు సహకార సంఘాల సేవలను రుణ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. సంఘ డైరెక్టర్లు భట్రాజు శ్యామల రాజు, కుంచే కోటేశ్వరరావు, యర్రంశెట్టి సేతు మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

జిందాల్ ప్లాంట్‌కు వ్యర్థాల తరలింపు



చెత్త వాహనాల తరలింపును ప్రారంభిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ తదితరులు

నూజివీడు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వ్యర్థాలను జిందాల్ పవర్ ప్లాంట్‌కు తరలిస్తున్నట్లు నూజివీడు మున్సిపల్ వైస్ చైర్మన్, పగడాల సత్యనారాయణ, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చెరుకూరి దుర్గాప్రసాద్ అన్నారు. నూజివీడు రాజీవ్ సర్కిల్ నుంచి శనివారం జిందాల్ పవర్‌కు పట్టణంలో ఉత్పన్నమైన 25 టన్నుల వ్యర్థాలను రెండు లారీల్లో తరలించారు. ఈ వాహనాలను వారు ప్రారంభించి మాట్లాడుతూ సంపద సృష్టి కేంద్రాల పేరుతో గత తెలుగుదేశం ప్రభుత్వం షెడ్లను నిర్మించగా, అనంతరం ఏర్పడిన వైసీపీ ప్రభుత్వం వాటిని పట్టించుకోలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన వెంటనే చెత్తనుంచి సంపద సృష్టించే దిశగా సీఎం చంద్రబాబునాయుడు చర్యలు చేపడుతున్నారని, ఇందుకు అనుగుణంగా మంత్రి పార్థసారథి తన నియోజకవర్గాన్ని సంపూర్ణ పారిశుధ్య నియోజకవర్గంగా మార్చే దిశగా కృషిచేస్తూ తడి చెత్తను కంపోస్ట్ ఎరువుగా, పొడిచెత్తను జిందాల్ పవర్ ప్లాంట్‌కు తరలిస్తున్నట్లు వారు తెలిపారు. నూజివీడు మున్సిపల్ కమిషనర్ వెంకట రామిరెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో నైపుణ్యం సాధించాలి

ముసునూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో నైపుణ్యత సాధించాలని హెచ్‌ఎం డి.శైలజ అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా శనివారం ముసునూరు జడ్పీ పాఠశాలలో విద్యార్థులకు వాలీబాల్, రన్నింగ్, బాస్కెట్‌బాల్ పోటీలను పీడీ నెరుసు హేమ నిర్వహించి, తన సొంత ఖర్చులతో విజేతలకు బహుమతులను అందజేశారు. ఉపాధ్యాయులు, గంగుల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	118, 126, 137
చికెన్ విత్ స్కిన్	234
చికెన్ స్కిన్‌లెస్	244
నెక్ కోడి గుడ్డు ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ.475	

చిన్నంపేటలో ఫాగింగ్

చాట్రాయి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): చిన్నంపేటలో వైద్య ఆరోగ్యశాఖ, గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో శనివారం దోమల నివారణకు ఫాగింగ్ నిర్వహించారు.

సిబ్బంది కొరతపై లేఖ రాస్తాం

- ఎంపీడీవో భార్గవి
- మండల పరిషత్ సమావేశంలో సిబ్బంది కొరతపై ప్రస్తావించిన సభ్యులు
- సభ్యుల సంతకాలతో జడ్పీ సీఈవోకు లేఖ రాస్తామని వెల్లడి



చాట్రాయి మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో భార్గవి

చాట్రాయి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): చాట్రాయి మండల ప్రభుత్వ కార్యాలయాలలో సిబ్బంది కొరతపై ప్రజాప్రతినిధుల సంతకాలతో జడ్పీ సీఈవోకి లేఖ రాస్తామని ఎంపీడీవో భార్గవి అన్నారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం ఎంపీపీ లంకా నిర్మల అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పలువురు సభ్యులు సిబ్బంది కొరతపై ప్రస్తావించటంతో ఆమె మాట్లాడుతూ గ్రామ సచివాలయాలు, మండల పరిషత్, ఇతర మండల స్థాయి అధికారులు 50 శాతం కంటే తక్కువ ఉండటంతో ప్రజలకు సరైన సేవలు అందటం లేదని, సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. యూరియా దొరక్క రైతులు ఇబ్బందులు పడుతున్నారని, తగినంత యూరియా సరఫరా చేయాలని వైస్ ఎంపీపీలు సుబ్బారెడ్డి, జగన్మోహనరావు కోరగా, దీనిపై ఏవో శివశంకర్ మాట్లాడుతూ రైతులు పరిమితికి మించి యూరియా వాడటం వలన కొరత ఏర్పడుతున్నదని, నానో యూరియా, నానో డీఏపీ వాడటం వలన కొరతను అధిగమించవచ్చునని, సెప్టెంబరు 5న అన్ని పీఏసీఎస్‌లకు యూరియా వస్తుందని, రైతులందరికీ యూరియా అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ మండలంలో కొన్ని గ్రామాల్లో అపరిశుభ్రత కారణంగా జ్వరం కేసులు ఎక్కువ వస్తున్నాయన్నారు. కాచి చల్లార్చిన నీరు తాగాలని, దోమలు పుట్టకుండా కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, చాలా మంది చిన్న వయస్సులోనే షుగర్ బారిన పడటం ఆందోళన కలిగించే విషయమని, చికెన్ తినటం తగ్గించి, కూరగాయలు ఎక్కువ తినటం, జీవనశైలి మార్చుకోవటం ద్వారా మధుమేహాన్ని నియంత్రించవచ్చునని అన్నారు. ఉద్యానశాఖ అధికారిణి హేమ మాట్లాడుతూ ఈ ఏడాది పామాయిల్ సాగు 850 హెక్టార్లు కాగా, ఇప్పటికి 650 హెక్టార్లు సాగయిందన్నారు. వివిధ ఉద్యాన పంటలకు ప్రభుత్వ సబ్సిడీలను వివరించారు. వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న డీఎస్పీ కె.వి.వి.ఎన్.వి. ప్రసాద్



నూజివీడు పట్టణంలో అవగాహన కల్పిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి షేక్ పెదఖాసిం



ముదినేపల్లి సదస్సులో మాట్లాడుతున్న కైకలూరు జూనియర్ సివిల్ జడ్జి శివ కిరణ్

సైబర్ నేరాలపై అవగాహన

నూజివీడు టౌన్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలు, సైబర్ నేరాలపై విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలని, నూజివీడు డీఎస్పీ కె.వి.వి.ఎన్.వి ప్రసాద్ అన్నారు. నూజివీడు మడుపల్లి తాతయ్య జూనియర్ కళాశాలలో శనివారం సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల నియంత్రణ, విద్యార్థినులకు సెల్ఫ్ డిఫెన్స్‌పై అవగాహన కల్పించారు. ఎవరైనా మాదక ద్రవ్యాలకు బానిసలుగా మారితే రీహాబిలిటేషన్ సెంటర్‌కు పంపించాలన్నారు. పట్టణ సీఐ సత్య శ్రీనివాస్, కళాశాల ప్రిన్సిపాల్ తేజేంద్ర పాల్గొన్నారు.

విశాఖ తరలిన జన సైనికులు

నూజివీడు టౌన్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో నిర్వహించతలపెట్టిన సేనతో సేనాని కార్యక్రమానికి నూజివీడు నియోజకవర్గం నుంచి జన సైనికులు తరలివెళ్ళారు. ఉమ్మడి కృష్ణాజిల్లా జనసేన అధికార ప్రతినిధి మరీదు శివరామకృష్ణ నేతృత్వంలో జనసేన కార్యకర్తలు, కార్లు, బస్సుల్లో విశాఖపట్నంకు తరలివెళ్ళారు. జనసేన నాయకులు ఎన్.సునీల్‌కుమార్, నూజివీడు మండల జనసేన అధ్యక్షులు యర్రంశెట్టి రాము, ముత్యాల కామేష్ తదితరులు పాల్గొన్నారు.

రహదారిపై నిలిచిన నీటితో వెతలు

చాట్రాయి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): సూరంపాలెం యాదవ బజారులో రహదారిపై వర్షం నీరు నిలుస్తుండటంతో ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. దీంతో అపరిశుభ్రత తాండవించి వ్యాధుల బారిన పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకువెళ్ళినా పట్టించుకోవటం లేదని, ఉన్నతాధికారులైనా సమస్య పరిష్కరించాలని ప్రజలు వేడుకుంటున్నారు.

బాల్య వివాహాలు చేస్తే జైలు, జరిమానా

నూజివీడు టౌన్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): నూజివీడు పట్టణంలో బాల్య వివాహా ల నిరోధక చట్టం 2006 పై శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి షేక్ పెదఖాసిం మాట్లాడుతూ ఆడపిల్లలకు 18, మగ పిల్లలకు 21 ఏళ్లు నిండేవరకు వివాహాలు జరిపించకూడదని, అలా చేస్తే చట్టరీత్యా నేరమన్నారు. బాల్యవివాహాలు చేసినట్లు అయితే రెండుసంవత్సరాల వరకు జైలుశిక్ష, లక్ష రూపాయల వరకు జరిమానా విధిస్తామని హెచ్చరించారు. బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు ఇందుపల్లి సత్యప్ర కాష్, న్యాయవాది ఎస్.కె.డి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ముదినేపల్లి: బాల్య వివాహాలు పిల్లల మానసిక, సామాజిక ఎదుగుదలపై తీవ్ర ప్రభావం చూపుతుందని కైకలూరు జూనియర్ సివిల్ జడ్జి ఎం.శివకిరణ్ అన్నారు. మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో ముదినేపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం 'బాల్య వివాహాలు- వాటి అనర్థాలపై జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలు జరిపితే కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉందని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఓరుగంటి సత్య నారాయణ మూర్తి, కైకలూరు కోర్టు ప్యానెల్ లాయర్ పి.పవన్ కాంత్, న్యాయవాదులు డీవీకే గంగాధరరావు, జయ ప్రకాష్, శంకర శాస్త్రి, ముదినేపల్లి ఎస్ఐ వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలి



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ప్రసన్న

కైకలూరు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు అపరిచిత వ్యక్తులపట్ల అప్రమత్తంగా ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రసన్న అన్నారు. శనివారం కైకలూరు మండలం ఆలపాడు జిల్లా పరిషత్ హైస్కూల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్, పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రసన్న మాట్లాడుతూ నేటి సమాజంలో సెల్‌ఫోన్ల వ్యామోహంలో అనేకమంది విద్యను నిర్లక్ష్యం చేస్తున్నారని సోషల్ మీడియా ద్వారా పరిచయమయ్యే వారే కాక రోడ్లపైన, ఇళ్లవద్ద మగవారు మాట్లాడేటప్పుడు వారిని గమనించాలని, ఏదైనా తప్పుగా అనిపిస్తే వెంటనే తల్లిదండ్రులకు లేదా ఉపాధ్యాయుల దృష్టికి తీసుకురావాలన్నారు. అలాగే విద్యార్థినుల పట్ల ఎవరైనా అనుచితంగా ప్రవర్తించినా, వేధింపులకు గురిచేసినా పోక్సో చట్ట ప్రకారం కేసు నమోదు చేస్తారన్నారు. హెచ్‌ఎం చప్పిడి పార్థసారథి, అంగన్వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.



మండవల్లిలో స్వామివారి ఊరేగింపు



తామరకొల్లులో..



కొండంగిలో..

ఘనంగా గణనాథుల ఊరేగింపు

కైకలూరు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): గణనాథుడి విగ్రహాలను మండలంలోని తామరకొల్లు, వేమవరప్పాడు, రాచపట్నం, కైకలూరు వైఎస్సార్ కాలనీలో వైభవంగా ఊరేగించారు. పూలతో అలంకరించిన వాహనాలపై మేళతాళాలతో ఊరేగింపు జరిపారు. కైకలూరు టౌన్ పోలీసులు బందోబస్తు ఏర్పాట్లు నిర్వహించారు.

చాట్రాయి: పర్వతాపురంలో టీడీపీ నాయకులు బూబత్తుల చెన్నారావు, బొర్రా నాగేశ్వరరావు, ఉయ్యాల దిలీప్, రామకృష్ణ, రంగారావు, చెన్నకేశవులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మండవల్లి: మండవల్లి రామకృష్ణ మందిరంలోని స్వామివారి లడ్డూ ప్రసాదాన్ని వేలంలో నల్లిబోయిన చింతయ్య రూ.6900కు దక్కించుకున్నారు. భైరవపట్నంలో నిర్వహించిన వేడుకల్లో శనివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు.

కలిదిండి: మండలంలో కొండంగి, మట్టగుంట, గుర్వాయిపాలెం, సానారుద్రవరం, కోరుకొల్లు, ఆవకూరు, కొచ్చెర్ల గ్రామాల్లో శనివారం గణేష్ నిమజ్జనాలు ఘనంగా నిర్వహించారు. గణనాథులను ట్రాక్టర్లపై మేళతాళాలతో బాణాసంచా కాల్చుతూ ఊరేగించి కాల్వల్లో నిమజ్జనం చేశారు. ఎస్ఐ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు. ఆయా గ్రామాల ఆలయ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ముసునూరు: ముసునూరు పడమట రామాలయంలో శాంతి గణపతి వద్ద ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శనివారం భారీ అన్నసమారాధన జరిగింది. రావిచెట్టు సెంటర్‌లో మహాగణపతికి విశేష పూజలు నిర్వహించి, మహిళలు కుంకుమ పూజలు చేశారు. సిల్క్‌నగర్ ఆంజనేయస్వామి ఆలయంలో గణేషుడు, తూర్పు రామాలయంలో విఘ్నేశ్వరులకు నిమజ్జనాల సందర్భంగా ఊరేగింపులను ఘనంగా నిర్వహించారు. గోపవరం, చెక్కపల్లి, రమణక్కపేట, గుడిపాడు, కొర్లకుంట, గోగులంపాడు తదితర గ్రామాల్లో గణేష్ ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి.

ముదినేపల్లి: మండలంలో ఏర్పాటు చేసిన సుమారు 80 మంటపాలతోపాటు పెదగొన్నూరులోని గణపతి ఆలయంలో స్థానిక శాలి వాహన సంఘం ఆధ్వర్యంలో నవరాత్రుల సందర్భంగా నిత్య పూజలు జరుగుతున్నాయి. ముదినేపల్లిలోని వై.జంక్షన్‌లో గణపతి నవరాత్రుల కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మంటపంలో ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రామకృష్ణ, దాకరం పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు బాబూ రాజేంద్ర ప్రసాద్, బీసీ సంక్షేమ సంఘం నాయకులు శొంఠి కుమార స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎదగాలి.. ఒదగాలి!

(5వ పేజీ తరువాయి)

చేయాలని భావించి ఏళ్ల తరబడి కష్టపడినా గారపాటి సీతారామాంజనేయ చౌదరి వంటి నేతలు వెనుకబడి పోవాల్సి వచ్చింది. పార్టీ పదవుల్లోనూ సీనియర్లకు మొఖం చాటేసి తాము ఎంపిక చేసిన వారికే ప్రాధాన్యం లభిస్తూ వచ్చింది. అయితే ఈ మధ్యనే కొంచెం మార్పు కనిపిస్తోంది.

జిల్లాకే ప్రాధాన్యత..

సాధారణంగా పార్టీ కార్యక్రమాల నిర్వహణ, చురుకుదనం, కేడర్‌లో ఊపు తెచ్చే నేతలకే బీజేపీలో అత్యంత ప్రాధాన్యత ఉండేది. చాన్నాళ్ల తర్వాత రాష్ట్ర కమిటీలో జిల్లాకు చెందిన ఇద్దరు నేతలకు ఉపాధ్యక్ష హోదా కల్పించి, ఆ మేర కేడర్‌లో కొంతలో కొంత ఉత్సాహం నింపగలిగారు. రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ ఈ మేరకు ముందు చూపు ప్రదర్శించారు. జిల్లాలో బీజేపీ ఎమ్మెల్యే, సీనియర్ నేత కామినేని శ్రీనివాస్ కొనసాగుతుండగానే ఇదే జిల్లాలో పార్టీ కార్యవర్గంలో ఇద్దరి నేతలకు ఒకేస్థాయి కలిగిన పదవులు ఇవ్వడం తాజా పరిణామంగానే పార్టీ నేతలు భావిస్తున్నారు. ఉత్తరాంధ్ర ఇన్‌చార్జిగా ఉన్న గారపాటి సీతారామాంజనేయ చౌదరి (తపన చౌదరి)ని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నుంచి పదోన్నతి కల్పించారు. గత ఎన్నికల హయాంలో బీజేపీ అగ్రనేత రాజ్‌నాథ్‌సింగ్ జిల్లాలో పర్యటిం చేందుకు వీలుగా సన్నాహాలు చేసిన వారిలో తపన చౌదరి ఒకరు. ఈ ప్రాంతానికి సంబంధించి ఏలూరునే టార్గెట్‌గా చేసుకుని పార్టీ అగ్రనేతలు వచ్చినా, పలు కమిటీలకు చెందిన నేతలు వచ్చినా ఈ ప్రాంతాన్నే సిఫారసు చేసేవారు. ఇప్పుడు ఎలాగూ జిల్లా నాయకత్వంను చౌటపల్లి విక్రమ్ కిశోర్ సాధ్యమైనంత మేర ముందుకు నడిపేందుకు ప్రయత్నిస్తున్నారు. ఆయనతో పాటు పార్టీలో ఉన్న కృష్ణప్రసాద్, సుధాకర్ కృష్ణ వంటివారు పార్టీ కార్యక్రమాల్లో ఇప్పటికి చురుగ్గానే ఉన్నారు.

స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను సద్వినియోగం చేసుకోండి

ఆగిరిపల్లి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులందరూ స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవోలు ఆనంద్‌కుమార్, హేబెల్ సూచించారు. మండలంలో శనివారం ఆగిరిపల్లి, ఈదులగూడెం, ఈదర, అడవినెక్కలంలో నిర్వహించిన స్కూల్ కాంప్లెక్స్ క్లస్టర్ సమావేశాలను వారు పరిశీలించి మాట్లాడుతూ ఉపాధ్యాయులు బోధన విధానాన్ని మెరుగుపరుచుకొని విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపించాలన్నారు. ప్రధానోపాధ్యాయులు పులి పుష్పలత, శారద, తాడి ప్రసాద్, పివి రమణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ

ముదినేపల్లి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వడాలి ప్రాథమిక పాఠశాలను ముదినేపల్లి ఎంఈవో-2 కె.నరేష్ కుమార్ పరిశీలించారు. విద్యార్థుల విద్యాసామర్థ్యాన్ని, మధ్యాహ్న భోజన పథకం పర్యవేక్షించారు. నాణ్యమైన, రుచి, శుచితో కూడిన భోజనం విద్యార్థులకు అందించేందుకు ఉపాధ్యాయులు, వంట ఏజెన్సీ నిర్వాహకులు ప్రయత్నించాలన్నారు. హెచ్‌ఎం జితేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రభుత్వ బీమా పథకాలను వినియోగించుకోవాలి

మండవల్లి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ఇండియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో ప్రభుత్వం అందిస్తున్న బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మేనేజర్ గోపాలరావు తెలిపారు. మండవల్లి మండలం గన్నవరంలో శనివారం మహిళలకు అవగాహన కల్పించారు. అతి తక్కువ ప్రీమియంతో ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి సురక్ష, జీవనజ్యోతి బీమా పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. మండవల్లి బ్రాంచ్ పరిధిలో సుమారు రూ.2 కోట్లు ఇన్సూరెన్స్ క్లైమ్‌లు లబ్దిదారులు ఇవ్వటంపై బ్రాంచ్ మేనేజర్లు, సిబ్బంది తదితరులను అభినందించారు.

వృద్ధులకు అన్నదానం

ముదినేపల్లి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): శ్రీ కృష్ణ యాదవ సేవా సంఘం ముదినేపల్లి మండల శాఖ అధ్యక్షుడు, దాకరం పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు సోమా సత్యనారాయణ, పేరూరు మాజీ సర్పంచ్ ఆధ్వర్యంలో శనివారం గుడివాడలోని వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం నిర్వహించారు. కుమార్తె పుట్టిన రోజు సందర్భంగా ఆడంబరాలను తగ్గించుకుని వృద్ధులకు అన్నదానం జరపడం విశేషం. ట్రాఫిక్ ఎస్ఐ వి. భాగ్యవతి ప్రారంభించిన ఈ కార్యక్రమంలో యాదవ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పుట్టిహరి కుమార్ యాదవ్, ఉపాధ్యక్షుడు జాజుల మునీంద్ర, సంఘ నాయకుడు జాజుల తాతారావు, వృద్ధాశ్రమ నిర్వాహకుడు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

క్రైమ్ కార్నర్

మహిళపై దాడి

కైకలూరు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మహిళపై తండ్రీ కొడుకులు దాడి చేసిన ఘటనపై కైకలూరు రూరల్ ఎస్సై వి. రాంబాబు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం కైకలూరు మండలం గుమ్మళ్ళపాడు గ్రామానికి చెందిన ఇంటి మరియమ్మ తన పనులపై బయటకు వెళ్లింది. తిరిగి ఇంటికి వచ్చేసరికి ఇంటి చుట్టూ కట్టుకున్న రక్షణ దడులను పశువులు పాడుచేయడమే గాక ఇంటి ఆవరణ అంతా చిందరవందరంగా తొక్కివేశాయి. దీంతో ఆగ్రహించిన మరియమ్మ పశువులు ఎవరివో తెలియక తొక్కివేశాయని తిట్టుకుంది. దీంతో అదే గ్రామానికి చెందిన కొండపల్లి మాణిక్యాలరావు, అతని కుమారుడు తమనే తిడుతున్నావంటూ వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో మాణిక్యాలరావు కర్రతో దాడి చేయడంతో మరియమ్మ తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను కైకలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్సై వి రాంబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అత్తింటి వేధింపులపై ఫిర్యాదు

ముదినేపల్లి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): భర్త, అత్తింటివారి వేధింపులు తట్టుకోలేక ఆ వివాహిత పుట్టింటికి చేరింది. పోలీసుల కథనం ప్రకారం ముదినేపల్లి మండలం పెయ్యేరు గ్రామానికి చెందిన పెందుర్తి మౌనికకు హైదరాబాద్ రామచంద్రపురంలోని అశోక్‌నగర్‌కు చెందిన మేత్రా అనిల్ కుమార్‌కు ఏడాది క్రితం వివాహమైంది. ఆ సమయంలో రూ. 15 లక్షలు కట్నంగా ఇచ్చారు. వివాహానంతరం హైదరాబాద్‌లో అత్తవారింటికి కాపురానికి వెళ్ళిన కొద్ది రోజుల్లోనే మౌనికకు అదనపు కట్నం వేధింపులతో పాటు ఆమె పాదం మంచిది కాదన్న అవమానాలు మొదలయ్యాయి. దీంతో మౌనిక పుట్టింటికి వచ్చేసింది. శనివారం ఆమె ముదినేపల్లి పోలీసులకు అత్తింటివారి వేధింపులపై ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి ఎస్ఐ వీరభద్రరావు దర్యాప్తు చేస్తున్నారు.